Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 07.02.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 36 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# ఆఖరిపోరాటం



- పార్లమెంటులో ఫైనల్ మ్యాచ్
- టీ-బిల్లు టెన్షన్‌లో రాష్ట్రం
- ఢిల్లీలో మోహరించిన ఇరువర్గాలు
- బిల్లుపై వేగంగా వెళ్తున్న కేంద్రం
- స్పీడ్‌బ్రేకర్‌గా మారుతున్న విపక్షం
- తెలుగుజాతి ఒకటిగానా... రెండుగానా...
- తేలేది ఇంకొద్దిరోజుల్లోనే!

*విభజన మ్యాచ్ క్లైమాక్స్‌కు చేరింది. చివరి ఓవర్ కీలకంగా మారింది. ఈ ఓవర్‌లో పార్లమెంట్‌దే కీలకపాత్ర. బిల్లు ఆగిందా తెలంగాణ గోవిందా? బిల్లు పాసయ్యిందా... సమైక్యాంధ్ర గోవిందా. ఏదైనా తేలడానికి ఇంకొద్దిరోజులే. తెలుగుజాతి ఒకటిగా ఉంటుందా? రెండుగా విడిపోతుందా అనేది తేలేది త్వరలోనే!*

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ఢిల్లీకి చేరిన నేపథ్యంలో ఆంధ్రా రాజకీయాలతో దేశరాజధాని వేడెక్కింది. దేశంలోని అన్ని రాజకీయపక్షాలకు కూడా ఇప్పుడు రాష్ట్ర విభజన బిల్లే ప్రధానాంశమైపోయింది. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి తాము అడ్డదిడ్డంగా రూపొందించిన తెలంగాణ బిల్లును పార్లమెంటులో గట్టెక్కించాలనే మూర్ఖపు పట్టుదలతో కేంద్రప్రభుత్వముంటే, రాష్ట్ర విభజన బిల్లును అడ్డుకోవడానికి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి అంతకంటే పంతంతో పనిచేస్తున్నారు. తనను ముఖ్యమంత్రిగా నియమించిన కాంగ్రెస్ అధిష్టానంతోనే ఆయన తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర సమైక్యతను (మిగతా 14వ పేజీలో)






(వివరాలు 7,8,9,10 పేజీలలో)

## సాఫ్ట్‌వేర్ సామ్రాజ్యానికి...
## తెలుగు రారాజు!

(వివరాలు 14వ పేజీలో)

## ఢిల్లీలో ఢీ ఢిల్లీతో ఢీ



**కాంగ్రెస్ అధిష్టానం కన్నెర్ర జేసిందంటే ఆ పార్టీ నాయకులెవరైనా సరే ఫ్యాంట్‌లు తడుపుకోవాల్సిందే. కాంగ్రెస్ అధిష్టానం అంత పవర్‌ఫుల్. వాళ్లు కసి పెంచుకుంటే మనిషిని చావనీయరు, బ్రతకనీయరు. కాబట్టే కాంగ్రెస్‌లో వున్న నాయకులు చాలామంది బానిసత్వపు ఛాయతో కనిపిస్తుంటారు.**

కాని రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం అధిష్టానాన్ని అంటే సోనియాగాంధీని వ్యతిరేకించి మొనగాడనిపించుకుంటున్నాడు. కిరణే గనుక అధిష్టానం చెప్పినమాటకల్లా గంగిరెద్దులా తలాడిస్తూ ఉంటే రాష్ట్ర విభజన నల్లేరుమీద నడకలా జరిగిపోయి ఉండేది. రాష్ట్ర విభజన విషయంలో ఆయన తన పార్టీకే ఎదురుతిరిగాడు. కాంగ్రెస్ పెద్దలనే ఎదిరించాడు. విభజనపై సిడబ్ల్యూసిలో నిర్ణయం తీసుకుంది మొదలు ఆయన అధిష్టానానికి వ్యతిరేకంగానే మాట్లాడుతున్నాడు. శాసనసభలో విభజన బిల్లును తిరస్కరించి పంపడం ద్వారా కేంద్రానికి కిరణ్ కొరుకుడుపడని కొయ్యగా మారాడు. అక్కడితో (మిగతా 14వ పేజీలో)

## భారత 'రత్నాలు'



ఈ నెల 4న న్యూఢిల్లీలో భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా 'భారతరత్న' పురస్కారాలను అందుకుంటున్న మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.ఎన్.ఆర్.రావు.

## మిడిల్‌డ్రాప్

- హ్యాండిచ్చిన వైసిపి... గట్టునపడ్డ కెవిపి!
- సీఎం సలహాతో వెనక్కితగ్గిన ఆదాల



(వివరాలు 14వ పేజీలో)

## ముందుకు కదలని సెజ్‌లు...

# మునిగిన రైతులు

**జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో పలుచోట్ల పారిశ్రామిక కేంద్రాలను మంజూరు చేసారు. కృష్ణపట్నం పోర్టుతో పాటు శ్రీసిటీ, మేనకూరు సెజ్, చింతవరం సెజ్, ఇఫ్కోసెజ్‌లు మంజూరుచేసారు. వైయస్సే ఉండుంటే ఈపాటికి ఈ సెజ్‌లన్నీ కూడా ఒక దారికి వచ్చి ఉండేవే! కాని వై.యస్. మరణంతో జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి గ్రహణం పట్టినట్లయ్యింది.**




కృష్ణపట్నంపోర్టు ఎలాగూ జరిగిపోతుంది. దానికి అనుబంధంగా పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి కూడా! ఇక జిల్లాకు మంజూరైన సెజ్‌లలో చెప్పుకోదగింది తడ సమీపంలోని శ్రీసిటీ. దేశంలోనే అత్యుత్తమ ఆర్థిక మండలిగా ఇది రూపాంతరం చెందుతుంది. ఎన్నో విదేశీ కంపెనీలను ఇక్కడ పరిశ్రమలు స్థాపించేలా చేయడంలో శ్రీసిటీ ఛైర్మెన్ రవి సన్నారెడ్డి విజయం సాధించారు.

కాని నాయుడుపేట మండలంలోని మేనకూరుసెజ్, కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్‌సెజ్‌లు అంతగా ముందుకు నడవడం లేదు. మేనకూరు సెజ్‌లోనన్నా కొన్ని కంపెనీలు వచ్చాయి. కొన్ని పెద్దకంపెనీలు ఇక్కడ తమ పరిశ్రమలకు భూమిపూజ చేసి వెనక్కి వెళ్ళాయి. చింతవరం వద్ద మాస్‌హోల్డింగ్ గార్మెంట్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగినా అది రాలేదు. అన్నింటికంటే అన్యాయమేంటంటే రాచర్లపాడు వద్ద వున్న ఇఫ్కో కిసాన్‌సెజ్. ఇక్కడ చుట్టుపక్కల గ్రామాల రైతుల భూములు గాని, అసైన్‌మెంట్లు గాని, ఇతరత్రా భూములు గాని 6వేల ఎకరాలకు పైగా సేకరించారు. పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు ఇఫ్కో ఎరువుల కర్మాగారం కట్టాలని సేకరించిన భూమిలివి. ఇఫ్కో ఫ్యాక్టరీ రాలేదు గాని భూములు మాత్రం అలాగే మిగిలిపోయాయి. ఈ భూములను సద్వినియోగం చేసి ఈ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ ఇఫ్కో కిసాన్‌సెజ్‌కు శంకుస్థాపన చేసారు. దీనిలో భాగంగానే సెజ్ చుట్టూ ప్రహరీగోడ కూడా నిర్మించారు. వై.యస్ ఉద్దేశ్యం ప్రకారం ఎన్నో వ్యవసాయ సంబంధ పరిశ్రమలు ఇక్కడకు రావాలి. వై.యస్. మరణం తర్వాత ఈ సెజ్ గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. దాదాపు 20ఏళ్ల నుండి వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగా కళ్ల ముందే కనపడుతుండడంతో ఇక్కడ రైతులు గుండెలు మండుతున్నాయి. మీరు పరిశ్రమలు పెట్టేదీ లేదు, పాడూ లేదు. మేం వ్యవసాయం చేసుకుంటాం, మా భూములు మాకివ్వండని రైతులు అంటున్నారు. ఈ సెజ్ మీద ఇప్పటికే 150కోట్లు ఖర్చు పెట్టాం. త్వరలో పరిశ్రమలు పెడతామని ఇఫ్కో అధికారులంటున్నారు. ఇక్కడ తరచూ రైతులకు, ఇఫ్కో అధికారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ భూములను అన్యాయంగా లాక్కున్నారని, ఇలా బీడుగా పెట్టేబదులు తమకిస్తే సేద్యం చేసుకుంటామని రైతులు కోరుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిశ్రమల కోసం భూములను ఎన్నేళ్లు బీడుగా పెడతారని వాళ్ల ప్రశ్నిస్తున్నారు.

## మెట్టరైలు...

# పట్టాలెక్కేనా?



**జిల్లా ప్రజలందరు కూడా ఫిబ్రవరి నెలలో ఆశలు పెంచుకోవడం, వెంటనే నిరాశ చెందడం సంప్రదాయబద్ధంగా వస్తుంది. ఇది గత కొన్నేళ్ల నుండి ఆనవాయితీగా వస్తుంది. ఎందుకంటే కేంద్రం రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టేది ఈ నెలలోనే! ప్రతి బడ్జెట్‌లోనూ మన జిల్లాకు ఏదో వస్తుందని ఆశపడడం, ఏదీరాక నిరాశ చెందడం పరిపాటై పోయింది.**

ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌ను మరికొద్దిరోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టనుంది. ఈసారి ఈ రైల్వేబడ్జెట్ వల్ల జిల్లాకేమన్నా ఒరుగుతుందేమోనని జనం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్ల నుండి కలగా మిగిలిన మెట్ట రైలు పట్టాలెక్కుతుందా? లేదా అన్నది ప్రశ్నగా వుంది. ఎన్నోమార్లు సర్వేల తర్వాత గతంలో నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ను రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్రం మంజూరు చేసింది. అయితే ఇంతవరకు సర్వేలు చేయడం తప్పితే ఈ లైన్ పనుల్లో అంగుళం కూడా పురోగతి కనిపించడం లేదు. మూడుజిల్లాల్లోని మెట్ట ప్రాంతానికి ఈ రైల్వేలైన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. మన జిల్లాలో చూస్తే వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, వింజమూరు, వరికుంటపాడు మండలాల ప్రజలకు అనువుగా ఉంటుంది. వాణిజ్య, వ్యాపార ఎగుమతులకు సౌకర్యంగా ఉంటుంది. సర్వే ప్రకారం ఈ రైలు మార్గం ద్వారా రైల్వేకు ఆదాయం ఉంటుందని అంచనా వేసారు. అంతేకాదు విజయవాడ - గూడూరు జంక్షన్ల మధ్య ఉన్న రైలు మార్గం తుఫాన్లు, వరదల సమయంలో దెబ్బతింటుంది. తుఫాన్ల సమయంలో కొన్ని రోజుల పాటు రైలు రవాణా ఆగిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి సమయాల్లో నడికుడి - శ్రీకాళహస్తి లైన్ ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రైల్వేలైన్‌కు ఈ బడ్జెట్‌లోనైనా కదలిక వస్తుందేమో చూడాలి.

ఇక గూడూరు - దుగరాజపట్నం, వెంకటాచలం - ఓబులాపురం రైల్వే లైన్ల పనులను చేపట్టాల్సి వుంది. గూడూరు, దుగరాజపట్నం రైల్వేలైన్ కొన్నేళ్ల క్రితమే మంజూరైంది. అయితే ఇంతవరకు దానిలో కదలిక లేదు. నిధులు మంజూరు కాలేదు. ఆసియాలోనే అతిపెద్ద పోర్టును దుగరాజపట్నం వద్ద కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పోర్టుకు శంకుస్థాపన జరిగితే ఆటోమేటిక్‌గా రైల్వేపనులు కూడా మొదలు కావాల్సి ఉంటుంది. ఇక కృష్ణపట్నం పోర్టు నుండి వెంకటాచలం వరకు రైల్వేలైన్ పూర్తయ్యింది. వెంకటాచలం నుండి ఓబులాపురం వరకు రైల్వేలైన్ పెండింగ్‌లో ఉంది. ఈ లైన్‌కు భూసేకరణ కూడా పూర్తయ్యింది. కాకపోతే రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు విడుదల కావడం లేదు. ఈ రైల్వేలైన్ పూర్తయితే కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుండేకాక కర్నాటక నుండి కూడా కృష్ణపట్నం పోర్టుకు వాణిజ్య సంబంధాలు పెరుగుతాయి. కాని దీనిని ఎప్పుడు మొదలుపెడతారో, ఎప్పుడు పూర్తి చేస్తారో అర్థం కాకుండా వుంది.

బ్రిటీష్ వారి కాలంలోనే బిట్రగుంట రైల్వేపరంగా ఓ వెలుగు వెలిగింది. ఇప్పుడు చీకట్లో వున్నట్లుంది. రైల్వే డివిజన్‌కు అన్ని అవకాశాలుండి కూడా డివిజన్ అర్హతకు నోచుకోలేకపోయింది. లోకోషెడ్ తెరమరుగయ్యింది. లాలూ ప్రసాద్‌యాదవ్ రైల్వేమంత్రిగా ఉన్నప్పుడు కాంక్రీట్‌స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసారు. ఇప్పుడు ఆ శంకుస్థాపన రాయి కూడా మట్టిగొట్టుకుపోయింది. ఈ ఫ్యాక్టరీ పూసే లేదు. ఇక రైల్వేస్టేషన్లలో సమస్యలు సరేసరి. నెల్లూరు, కావలిలలో కొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని ప్రజలు ఎప్పటి నుండో కోరుతున్నారు. అలాగే చెన్నై - నెల్లూరు, తిరుపతి - నెల్లూరుల మధ్య మెమో రైళ్లను పెంచడంతో పాటు, నెల్లూరు - బెంగుళూరుల మధ్య ఫాస్ట్ పాసింజర్‌ను ప్రవేశపెట్టాలని ప్రజల కోరిక.

రైల్వే బడ్జెట్‌లో ఏదన్నా సాధించాలంటే స్థానిక ఎంపీల చొరవ చూపాలి. కాని మన జిల్లాకు చెందిన ఎంపీలు ఇప్పుడు జిల్లా సమస్యల మీద దృష్టి పెట్టే స్థితిలో లేరు. విభజన రాజకీయాలలో కొందరు, కాంగ్రెస్ అధిష్టానం సేవలో మరికొందరు తలమునకలై ఉన్నారు. మన ఎంపీలు ఇంత అవతారంగా ఉంటే రైల్వేబడ్జెట్‌లో మాత్రం మనకు ఏం వచ్చి ఛస్తాయ్...!

## మురళికే...



# మళ్ళీ బాధ్యతలు

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా మేరిగ మురళీధర్‌నే మళ్లీ నియమించారు. ఆదివారం ఇడుపులపాయలో జరిగిన పార్టీ ప్లీనరీలో పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈమేరకు మురళీని కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. 9నెలల క్రితమే మురళీ పార్టీ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. పార్టీని స్థాపించినప్పటి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఉంటూ వచ్చారు. అయితే జిల్లా పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల కారణంగా కాకాణి ఆ పదవి నుండి వైదొలిగారు. అప్పట్లో మేకపాటి సోదరులు సూచించిన మురళీని ఈ పదవిలో పెట్టారు. ఇంకొద్ది రోజుల్లోనే ఎన్నికలు రాబోతున్నాయి. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించి పార్టీ కోసం కార్యకర్తలందరి చేత పని చేయించాల్సిన కీలక బాధ్యత కన్వీనర్‌ది. ఒకరకంగా కన్వీనర్‌కు ఇది పరీక్షా సమయం. ఈ సమయంలో కన్వీనర్‌గా ఆయన పనితీరు బాగుంటే జగన్ వద్ద భవిష్యత్ బాగుంటుంది.

# సర్దుకున్న సోమిరెడ్డి



**చెరువు మీద అలిగితే ఏమవుతుంది. రాజకీయపార్టీల మీద అలిగినా అదే అవుతుంది. రాజ్యసభ సీటు దక్కలేదని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో మధ్యలోనే బయటకొచ్చిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎక్కడ పార్టీని వదిలిపోతాడోనని చాలా మంది భావించారు. కాని ఆయన అంత తెలివితక్కువ మూర్ఖుడు కాదు. టైం బాగలేక అసెంబ్లీకి మూడుసార్లు ఓడిపోయాడుగాని, లేదంటే ఆయన రాజకీయ చాణక్యానికి ఓటమనేదే ఉండకూడదు.**

రాజ్యసభ కోసం పాపం బాగానే కష్టపడ్డాడు. అయితే చంద్రబాబు ఆయన పేరును కూడా పరిశీలనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించింది. చంద్రబాబుకు ఒక లెక్కుంది. పార్టీని వదిలే వాళ్లెవరు, వదిలి వెళ్లలేని వాళ్లెవరు అనేది ఆయన మైండ్‌లో ఉంది. పార్టీని వదిలి పోతారనుకున్న వాళ్ల మీదే చంద్రబాబు దృష్టి ఉంటుంది. సోమిరెడ్డి మాత్రం పార్టీని వదిలి వెళ్లలేని వారి జాబితాలో ఉన్నాడు. తెలుగుదేశంపార్టీ పరంగా చూసుకుంటే జిల్లాలో ఆయనే అగ్ర నాయకుడు. రాష్ట్రంలో కూడా టాప్‌టెన్‌లో ఒకడిగా వున్నాడు. ఇప్పుడు తెలుగుదేశాన్ని వదిలి ఇంకో పార్టీలోకి పోతే పొజిషన్ ఏంటి? వైకాపాలో సీటుకే గ్యారంటీ లేదు. అదీగాక రాజకీయాలలో తనకంటే బచ్చాలైన లీడర్ల క్రింద పనిచేయాల్సి వస్తుంది. కాంగ్రెస్‌లోకి పోయేదాని కంటే రాజకీయ సన్యాసం తీసుకుని ఇంట్లోనే ఉండడం నయం. కాబట్టి చంద్రబాబు పదవులిచ్చినా, ఇవ్వకపోయినా సోమిరెడ్డి ఎక్కడికీ పోలేదు. తెలుగుదేశంలో ఉండాల్సిందే!





## కావలి కాంగ్రెస్‌ను...

# కాసేదెవరు?

**జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటల్లో కావలి ఒకటి. స్వర్గీయ కలికి యానాదిరెడ్డి ఉన్నంతకాలం ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేకుండా ఉండింది. ఎన్టీఆర్ ప్రభంజనం బలంగా వున్న 1985 ఎన్నికల్లో కూడా ఇక్కడ కలికి యానాదిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది.**

1983 నుండి 2009 ఎన్నికల వరకు మూడుసార్లు మాత్రమే ఇక్కడ తెలుగుదేశం గెలిచింది. కలికి యానాదిరెడ్డి తర్వాత మాగుంట పార్వతమ్మ రంగప్రవేశంచేసి 2004 ఎన్నికల్లో ఇక్కడ నుండి విజయం సాధించారు. అయితే 2009ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజనలో అల్లూరు ఎగిరిపోవడంతో కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి కావలి సీటిచ్చారు. ఆయన పట్ల ఉన్న వ్యతిరేకత కారణంగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది.

ఇక్కడ నుండి కావలిలో కాంగ్రెస్ పతనం మొదలైంది. కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తర్వాత వైయస్సార్ కాంగ్రెస్‌లోకి పోయాడు. అక్కడ ఇమడలేక కొంతకాలం తర్వాత తిరిగి కాంగ్రెస్‌లోకే వచ్చాడు. ఈలోపు స్థానిక కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నాయకులు ఒక వర్గంగా ఏర్పడ్డారు. వీరంతా కూడా విష్ణును వ్యతిరేకిస్తున్నారు. పోనీ విష్ణును వ్యతిరేకిస్తున్న నాయకులు ఇక్కడ బలంగా ఉన్నారా అంటే అదీ లేదు. కావలి నియోజకవర్గంలో గట్టిగా చెప్పుకోదగ్గ కాంగ్రెస్ నాయకులు ఒక్కరూ లేరు. మాగుంట పార్వతమ్మ ఇక్కడే ఉండుంటే పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉండేదేమో! ఇప్పుడు విష్ణుకు ఇమేజ్ పోయింది. గ్రంధి యానాదిశెట్టి, టి.రమణయ్యనాయుడు, దామచర్ల శ్రీనివాసులు... ఇలాంటి నాయకులుంటే ఓట్లు తెచ్చేవాళ్లు కాదు. కావలిలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయినట్లే. ఇప్పుడున్నవాళ్లు కూడా తమ వ్యాపార అవసరాల కోసం ఎన్నికల దాకా కాంగ్రెస్‌లో ఉంటారు, ఆ తర్వాత జంప్ జిలానీలే!

# కోలుకున్న కంచి స్వామి



జయేంద్ర సరస్వతిని స్ట్రెక్చర్‌పై ఆసుపత్రికి తరలిస్తున్న శిష్యబృందం

నెల్లూరు నరగానికి వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి ఈ నెల 2వ తేదీ సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. బిపి లెవల్స్ తగ్గి గుండెపోటు రావడంతో వెంటనే ఆయన్ను శిష్యబృందం నగరంలోని జయభారత్ హాస్పిటల్‌కు తరలించారు. డాక్టర్లు పరీక్షించి ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రమాదం లేదని చెప్పడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. చెన్నై నుంచి వైద్య బృందం వచ్చి ఆయనకు చికిత్సలు అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆసుపత్రికి వచ్చి జయేంద్ర సరస్వతిని పరామర్శించారు. జయేంద్ర సరస్వతి అస్వస్థతకు గురయ్యారన్న సమాచారంతో నగర ప్రముఖులు, భక్తులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

**చెన్నైకు తరలింపు:** జయేంద్ర సరస్వతిస్వామీజీని మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన శిష్యబృందం ప్రత్యేకవాహనంలో సోమవారం తెల్లవారుజామున చెన్నైకి తరలించారు. చెన్నైలోని రామచంద్ర వైద్యకళాశాలలో ఆయనకు చికిత్స నిర్వహించారు. స్వామి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. స్వామి ఆరోగ్యం కుదుటపడడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## నారాయణ ఆరోగ్యమస్తు

# ఆనందం మస్తు మస్తు





నెల్లూరులో ఓ సాధారణ కోచింగ్ సెంటర్‌తో 0 నుండి తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి కృషితో తన విద్యాసంస్థలను అంచెలంచెలుగా దేశమంతటా విస్తరింపజేసిన నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ ఈరోజు జాతీయస్థాయిలో పేరుమోసిన విద్యావేత్త. దేశం నలుమూలలా తన విద్యా, వైద్య సంస్థలను విస్తరింపజేసినా తన నెల్లూరును మర్చిపోలేదు. వైద్యం ఖరీదైన ఈ కాలంలో కాస్తా సలీసుగా ఎక్కడన్నా వైద్యసేవలందుతున్నాయంటే అది నెల్లూరు రూరల్, చింతారెడ్డిపాలెం వద్దగల నారాయణ జనరల్ ఆసుపత్రిలోనే! ఇంతకాలం చాలా తక్కువ ఫీజులతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారం లేకుండా వైద్యసేవలందిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ ఖర్చు కూడా లేకుండా చేస్తున్నారు. నారాయణ 'ఆరోగ్యమస్తు' పథకం ద్వారా నారాయణ జనరల్ ఆసుపత్రిలో వివిధ జబ్బులతో వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితవైద్యం అందజేయనున్నారు. దివంగతనేత వై.యస్. రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల కోసం ఆరోగ్యశ్రీ పెట్టడం తెలిసిందే. నారాయణ తన ఆసుపత్రి ద్వారా ఆరోగ్యమస్తుతో ప్రజలందరికీ ఉచిత వైద్యసేవలు అందించనున్నారు. నారాయణ జనరల్ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరిన వారికి అడ్మిషన్ ఛార్జీలు వుండవు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజు, ఆపరేషన్ ఛార్జీలు ఉండవు. రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు, అల్ట్రాస్కానింగ్, భోజనం, మందులు అన్నీ ఉచితం. నర్సింగ్ ఛార్జీలు ఉండవు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం, కంటి వ్యాదులు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మానసికవ్యాధులు, చర్మవ్యాధులు, ఫిజియోథెరపి విభాగాలలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. అవుట్‌పేషంట్‌గా వచ్చేవారికి కూడా డాక్టర్ ఫీజుండదు. కొన్ని రకాల రక్త పరీక్షలతో పాటు, ఇసిజి, ఎక్స్‌రేలు ఉచితం.

జబ్బు వస్తే మొదట డబ్బు గురించి ఆలోచించే రోజులివి. ఆసుపత్రుల్లో ఖర్చులకు ఆస్తులమ్ముకోవాల్సిన కాలమిది. రకరకాల ఫీజులతో ఆసుపత్రులు పేషెంట్లను పీల్చి పిప్పి చేస్తున్నాయి. గుండె ఆపరేషన్ చేసిన పేషెంట్‌కు తన ఆపరేషన్ బిల్లు చూస్తే మళ్ళీ గుండెపోటు వచ్చే పరిస్థితి. వైద్యం వ్యాపారంగా మారిన ఈ కమర్షియల్ కాలంలో కూడా ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తానంటూ సేవాదృక్పథంతో ముందుకొచ్చిన డాక్టర్ నారాయణకు 'లాయర్' అభినందనలు.

# సేవాస్ఫూర్తితో రియాజ్ భాయ్@50



నెల్లూరులో ఎవరు వివాహ వేడుకలు జరుపుకుంటున్నా ముందుగా గుర్తొచ్చేది రియాజ్ బాషా. ఎందుకంటే పెళ్ళిళ్ళకు అవసరమైన లైటింగ్, హైరర్స్ అంతా ఆయనే చూస్తుంటాడు. హైదరాబాద్ లైటింగ్‌హౌస్ అండ్ హైరర్స్ అధినేత అయిన షేక్ రియాజ్ బాషా 50వ జన్మదిన వేడుకలను ఆయన ఈ నెల 1వ తేదీన సేవా కార్యక్రమాలతో జరుపుకున్నాడు. నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో అంధ విద్యార్థులకు, మదర్సాలలో విద్యార్థులకు, విశాలాక్షి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బియ్యం, దుస్తులు పంపిణీ చేసి తన సేవానిరతిని చాటుకున్నాడు.

తమ పుట్టినరోజులకు భారీస్థాయిలో ప్లెక్సీలు, పత్రికా ప్రకటనలు, కేక్ కట్టింగ్‌లతో అధికమొత్తం ఖర్చుపెట్టి సంబరాలు చేసుకునే ఎంతోమంది రాజకీయ నాయకులను మనం చూస్తుంటాం. వాస్తవానికి వాళ్ళు ప్రజాసేవకులైనప్పటికీ తమ పుట్టినరోజు గుర్తుగా ప్రజలకు పనికొచ్చే మంచి కార్యక్రమం ఒక్కటి కూడా చేయరు. ప్రజాసేవతో తనకు సంబంధం లేనప్పటికీ తన 50వ పుట్టినరోజును పేదలకు, అనాధలకు, అంధులకు సేవలందించడం ద్వారా సేవాస్ఫూర్తితో జరుపుకున్న రియాజ్‌బాషా అభినందనీయుడు.



# బంధం చెదిరిందా?



***గత ఐదేళ్ల నుండి జంట కవులుగా తిరుగుతున్న నెల్లూరు జంట ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ఇక వేరుపడే సమయం ఆసన్నమైందా? రాజకీయంగా ఇరువురి దారులు వేరవుతున్నాయా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది.***

2009లో ఇద్దరూ ఎమ్మెల్యేలుగా గెలిచిన పార్టీలు వేర్వేరు. వివేకా కాంగ్రెస్ అయితే ముంగమూరు ప్రజారాజ్యం అభ్యర్థిగా గెలిచాడు. నెల్లూరు నగరంలో వివేకా మద్దతునిచ్చి పనిచేసిన పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆయనకు దూరమైతే, ప్రత్యర్థిగా పోటీచేసిన శ్రీధరకృష్ణారెడ్డితో వివేకాకు స్నేహం కుదిరింది. చిరంజీవి తన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయకముందే నెల్లూరులో ఆ పార్టీ ఎమ్మెల్యేగా వున్న శ్రీధరకృష్ణారెడ్డి ఆనం వర్గంలో విలీనమైపోయాడు. ఈ ఐదేళ్లు ఆయన ఆనం అనుచరుడిగానే మసలుకున్నారు. పనులు, కార్యక్రమాల విషయంలో వారిమధ్య ఎప్పుడూ మనస్పర్థలు రాలేదు. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనమయ్యాక వారి బంధం మరింత ధృఢంగా మారింది. పరస్పర సహకారంతో ముంగమూరు నెల్లూరుకు బాగానే నిధులు మంజూరు చేయించుకున్నాడు. ఓపక్క వివేకా వెనుక నడుస్తూనే మరోపక్క నగరంలో తనకంటూ సొంత వర్గాన్ని పెంచుకుంటూ వచ్చాడు.

రాష్ట్రంలో మారిన రాజకీయపరిస్థితుల్లో ముంగమూరు ఇక కాంగ్రెస్‌లో ఉంటే లాభం లేదనుకున్నాడు. తెలుగుదేశంలోకి పోవాలనుకున్నాడు. ఇంతవరకు బాగానే వుంది. అయితే రాజ్యసభ బరిలో రెబల్‌గా నిలిచిన ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై ఆనం వివేకా ఫైర్ అయితే, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాత్రం మద్దతుగా నిలిచాడు. ఈ విషయంలోనే మొదటిసారిగా ముంగమూరు ఆనం వ్యతిరేక వైఖరిని అవలంబించాడు. దీనినిబట్టి చూస్తే ఆనం ట్రాక్ నుండి ముంగమూరు పూర్తిగా తప్పుకున్నట్లే కనిపిస్తుంది.

# విధులను వదిలి వీధుల్లోకి...

కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరినీ ప్రశాంతంగా పనిచేసుకోనీయడం లేదు. రాష్ట్ర విభజనతో అందరికీ పనిచేటు తెచ్చింది. కూసేగాడిదొచ్చి మేసేగాడిదను చెరిచిందన్న సామెతను నిజం చేసింది. రాష్ట్రంలో పని చేసుకుంటున్న, చదువుకుంటున్న వారిని కూడా చెడగొట్టింది.

కేంద్రం రాష్ట్ర విభజన నిర్ణయం ప్రకటించాక సీమాంధ్రలోని 13జిల్లాల్లో రెండు నెలలపాటు కార్యకలాపాలు స్థంభించిపోయాయి. పిల్లల చదువులు ఆగిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ఏపి ఎన్జీఓలు 2 నెలలు ప్రభుత్వ కార్యాలయాలకు హాజరుకాకుండా ఉద్యమాలతో వీధుల్లో పడ్డారు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కదిద్దుకుంటున్న తరుణంలో కేంద్రం పార్లమెంటులో టి–బిల్లు పెట్టడానికి సమాయత్తమైంది. దీనిని నిరసిస్తూ ఎన్జీఓలు సమ్మెకు పిలుపు నివ్వడంతో జిల్లావ్యాప్తంగా గురువారం నుండి ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఎన్జీఓలు విధులు బహిష్కరించారు. విద్యార్థి సంఘాలు కూడా సమైక్య ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

# హవ్వా... నువ్వు సమైక్యవాదివా?

## - ఆదాలపై విరుచుకుపడ్డ వివేకా



సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తాను సమైక్య వాదినని చెప్పుకుంటుంటే నవ్వొస్తుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఎద్దేవా చేశారు. 3వ తేదీ నెల్లూరు శ్రీహరినగర్‌లోని పత్తి రవీంద్రబాబు ఇంట్లో పెట్టిన విలేకరుల సమావేశంలో వివేకా మాట్లాడారు. ఏంచేసి నువ్వు సమైక్యవాదివయ్యావు... ఉద్యమం జరిగేటప్పుడు అసలు నువ్వెక్కడున్నావు. సమైక్యాంధ్ర జెండా పట్టావా, జనంతో నడిచావా, ర్యాలీల్లో పాల్గొన్నావా, దీక్షల్లో కూర్చున్నావా... ఏం చేసావని సమైక్యవాదివని చెప్పుకుంటున్నావని ఆదాలను ఎత్తిపొడిచారు. తెలంగాణలో ఉన్న తన డి–ఫారం పట్టాభూములను హరీష్‌రావు ఎక్కడ లాక్కుని పేదలకు పంచుతాడోనని భయపడి ఆరోజు ఆదాల బయటకు రాలేదన్నారు. 500కోట్లతో రాజకీయాలను మొదలుపెట్టి 15వేల కోట్లు దోచుకున్న వ్యక్తి ఆదాల అని ఆయన దుయ్యబట్టారు. రాజ్యసభ ఎన్నికలలో కెవిపి రామచంద్రరావు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడిపోడని, ప్రస్తుతమున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో చాలామందికి సీట్లు వచ్చిందే ఆయన వల్లని అన్నారు. పోతే గీతే కేశవరావు పోతాడని వ్యాఖ్యానించారు. తనను జోకర్ అంటే బాధపడనని, ప్రజలను సంతోషంగా ఉంచడం కోసం ఏ వేషానికైనా రెడీగా వుంటానన్నారు.

# మోసాలైనా, వేషాలైనా వివేకాకే చెల్లు

## - వివేకాను చెండాడిన ఆదాల



రాజకీయాలలో మోసాలైనా, వేషాలైనా ఆనం వివేకానందరెడ్డికే చెల్లుతాయని సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ పోటీలో నిలిచిన తనను టార్గెట్ చేస్తూ ఆనం వివేకా చేసిన విమర్శలను ఆదాల తిప్పికొట్టారు. జోకర్‌లా పూటకో వేషం వేస్తూ, మాటలతో మోసం చేస్తూ తిరగడం వివేకాకే చెల్లుతుందన్నారు. ఆయనొక పగటి వేషగాడని, తన అక్రమాలు వెలుగులోకి రాకుండా ఈ వేషాలతోనే మాయ చేస్తుంటాడని విమర్శించారు. తనను బర్రెలు మేపుకుంటూ వేలకోట్లు సంపాదించాడని వివేకా విమర్శించడాన్ని ఆయన స్వాగతించారు. బర్రెలు మేపుకుంటూ వ్యవసాయం చేసుకుంటూనే నేను ఎదిగానని, మరి ఆయన ఏం వ్యాపారాలు, వ్యవసాయం చేసి ఖరీదైన ఇంటర్నేషనల్ కార్లలో తిరుగుతున్నాడని వివేకాను ప్రశ్నించారు. తాను సమైక్య అభ్యర్థిగా బరిలోకి దిగానని, కాంగ్రెస్ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థులకు పోగా కాంగ్రెస్‌కు ఇంకా 22ఓట్లు మిగులుతాయని, అవి కాంగ్రెస్ ఎమ్మెల్యేనైన తనకు కాకుండా టీఆర్‌ఎస్ అభ్యర్థికి వేయిస్తారా? అని ప్రశ్నించారు. వెన్నుపోటు రాజకీయాలకు పెట్టింది పేరైన ఆనం వివేకాకు తనను విమర్శించే అర్హత లేదన్నారు. నెల్లూరు వీధుల్లో ఎవరి గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలంటే ఒకసారి నెల్లూరు రోడ్లపై తిరగాలని సూచించారు.




## సంకుచిత స్వభావి

తెలంగాణ బిల్లును తిరస్కరిస్తూ మూజువాణి ఓటుతో శాసన సభ ఆమోదించింది. కేంద్రమంత్రిగా వున్న జైపాల్‌రెడ్డి దీనిని ఆక్షేపించడం తగదు. ఆయన మాటలు చాలా చీప్‌గా ఉంటున్నాయి. ఒక ప్రాంతం ప్రజలను బాధపెట్టేలా ఉంటున్నాయి. ఇలాంటి సంకుచిత స్వభావికి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును ఎలా ఇచ్చారా అనిపిస్తుంది.

టి. జగదీష్‌రెడ్డి, ఆళ్లగడ్డ.

## మతం మారితే ఋణాలా?

మతం మార్చుకున్న ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఋణాలు మంజూరు చేస్తున్నట్లు ఓ ప్రభుత్వాధికారి చేసిన ప్రకటన ఇటీవల పత్రికలలో చూసాను. మనుషులు వ్యాపారం చేయడానికి, చదువుకోవడానికి ఋణాలు మంజూరు చేస్తే దేశం బాగుపడుతుంది. మతం మార్చుకుంటే ఋణాలు, విదేశాలలో వున్న పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే వాళ్లకు ఉచిత రవాణా అంటే దేశం నాశనమవుతుంది. ఈ చెత్త పథకాలను ఇప్పటికన్నా తీసేయాలి.

సి. రాజీవి, నెల్లూరు.

## విద్రోహుల జాబితా

సోనియా ఇంటి వద్ద బానిసల్లాగా తయారై రాష్ట్ర విభజనకు మద్దతు పలికి సీమాంధ్రకు ద్రోహం చేసిన కేంద్రమంత్రులు, ఎంపీలను సీమాంధ్ర విద్రోహులుగా ప్రకటించాలి. వారి పేర్లతో జాబితా విడుదల చేయాలి. వారిని సీమాంధ్రలో అడుగుపెట్టకుండా చేయాలి. వారికి సంఘ బహిష్కార శిక్ష విధించాలి.

ఎస్. గుర్నాథరెడ్డి, గూడూరు.

## ధర్మసందేహం

ఏపి ఎన్జీఓ అధ్యక్షుడు అశోక్ బాబు టి-బిల్లుని కాల్చివేయాలని అన్నాడన్న కారణంగా ఆయనపై కేసు నమోదు చేయమని కోర్టు ఆదేశించింది. 'సోగా' అనుంగు పుత్రుడు 'రాగా' నేర చరితులు ఎన్నికల్లో పాల్గొనేందుకు సంబంధించిన ఆర్డినెన్సును చించి పారేయాలన్నాడు. దేశ ప్రధానిని అవమానపరిచాడు. ఒక పార్టీ ఉపాధ్యక్షుడై ఉండి ఆ విధంగా అన్నందుకు ఆయనపై కేసు ఎందుకు నమోదు చేయలేదు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

# 'ప్రభా'తం

రాజకీయాలలో సొంతంగా బలం పెంచుకునేది అంటూ ఉండదు. అవతలవారి బలహీనతే ఇవతలవారి బలం అవుతుంది. జాతీయ రాజకీయాలలో ఇప్పుడు కాంగ్రెస్ బలహీనతే ప్రధానప్రతిపక్షం బీజేపీకి బలం కాబోతుంది. ఒక మంచి అవకాశం ఇప్పుడు బీజేపీ చేతిలో వుంది. కాంగ్రెస్‌ను పనికిమాలిన పార్టీగా చేసి తాను మంచి అనిపించుకోవడానికి బీజేపీకి సరైన అవకాశం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుతో బీజేపీ చేతికి బ్రహ్మాస్త్రం చిక్కింది. దీనిని ఆ పార్టీ సరిగ్గా వినియోగించుకుంటే సమాజం ముందు కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టవచ్చు. బీజేపీని హీరోగా ఆవిష్కరించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పోకడలు ఎవరికీ నచ్చడం లేదు. కేంద్రప్రభుత్వం విభజన బిల్లును ఏకపక్షంగా తయారు చేసింది. ఈ బిల్లును ఆమోదిస్తే తెలంగాణకు ఉన్నదంతా దోచిపెట్టి, సీమాంధ్రకు గోచిగుడ్డ కూడా పీకేసినట్లవుతుంది. ఎన్నికల హడావిడిలో తెలంగాణలో ఉన్న ఎంపీ సీట్లన్నీ తన ఖాతాలో వేసుకోవాలన్న అత్యాశతో కాంగ్రెస్ ఈ బిల్లుకు రూపకల్పన చేసింది. బిల్లు రూపొందించడంలో తెలంగాణ సీట్లే వాళ్లకు లక్ష్యంగా కనిపించాయి. ఇందుకోసం సీమాంధ్ర ప్రయోజనాలను కూడా తాకట్టు పెట్టారు. సీమాంధ్రలోనూ విభజనకు మద్దతుదారులున్నారు. తెలంగాణ ఇస్తే తప్పేంటి అన్నవాళ్లు కూడా కాంగ్రెస్ విభజన మార్క్ న్యాయం చూసి ఇదేం అన్యాయమంటూ ముక్కున వేలేసుకున్నారు. ఇలాంటి విభజన కంటే కలిసుంటేనే మేలనే అభిప్రాయాని కొచ్చారు. రాష్ట్ర విభజనను ఇంత కంపు చేసిపెట్టింది కాంగ్రెస్‌పార్టీ. సొంత పార్టీ ముఖ్యమంత్రే విభజన బిల్లును, విభజన తీరును వ్యతిరేకించారు. సొంత ప్రభుత్వమే విభజన బిల్లును తిరస్కరిస్తూ రాష్ట్రపతికి తిరిగి పంపింది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వుంది. రాష్ట్రంలోనూ అదే పార్టీ ప్రభుత్వం నడుస్తుంది. అదే పార్టీ రాష్ట్ర ప్రభుత్వం బిల్లును తిరస్కరించి పంపిందంటే కేంద్రప్రభుత్వానికి ఇంతకంటే సిగ్గుచేటు ఇంకోటి ఉండదు. ఇలా కాంగ్రెస్‌లోనే విభిన్న మార్గాలున్న ఈ బిల్లుకు ప్రధానప్రతిపక్షం బీజేపీ మద్దతునిస్తుందా? అలా మద్దతునిస్తే ఇక కాంగ్రెస్‌కు బీజేపీకి తేడా ఏముంది. ఇప్పటికే కాంగ్రెస్‌ను పనికిమాలిన పార్టీగా భావిస్తున్నారు. బీజేపీ కూడా దాని వరుసలో చేరుతుందా?

రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించి పంపినా కూడా అదే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. అంతే కాదు, ఈ బిల్లుపై మేం చేయాల్సింది చేసాం, బీజేపీ సహకరిస్తే ఆమోదం పొందుతుందన్నట్లుగా మాట్లాడుతుంది. అంటే బిల్లు పాసైతే తన ఖాతాలో వేసుకోవాలని, ఓడిపోతే బీజేపీపైకి నింద మోపాలని కాంగ్రెస్ పన్నాగం. రాష్ట్రాలను ఎలా విడదీయవచ్చో మేం చేసి చూపించాం. ఎలా విడదీయకూడదో కాంగ్రెస్ చూపిస్తుందని బీజేపీ నేతలంటున్నారు. ప్రజలను కులాలవారీగా, మతాలవారీగా, ఇప్పుడు ప్రాంతాలవారీగా విభజిస్తూ కాంగ్రెస్ విషం చిమ్ముతుందని బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ విమర్శించారు. విభజన బిల్లు ద్వారా కాంగ్రెస్‌పార్టీ సీమాంధ్ర మీద ఎంత విషం చిమ్ముతుందో ఆ పార్టీకి తెలియనిది కాదు. ఇంతటి విషపూరితమైన బిల్లును బీజేపీ ఆమోదిస్తే చరిత్రలో క్షమించడానికి కూడా బీజేపీకి అర్హత ఉండదు. ఎందుకంటే సీమాంధ్రను హత్య చేయడానికి కాంగ్రెస్ సిద్ధపడిపోయింది. ఆ హత్యను ఆపగల స్థితిలో వున్నది బీజేపీనే! ఆ హత్యను ఆపకుండా, హత్యకు సహకరిస్తే మాత్రం ఈ హత్యాపాపంలో కాంగ్రెస్ కంటే బీజేపీదే ప్రధానవాటా అవుతుంది. కాబట్టి ఈ హత్య పాతకాన్ని అడ్డుకోవడంలో బీజేపీ తనదైనపాత్రను పోషించాల్సి వుంది. చిన్న రాష్ట్రాలకు అనుకూలమన్న తమ వాదనకు నిలబడే సీమాంధ్రకు న్యాయం జరిగేలా చూడాల్సిన పెద్దమనిషి బాధ్యత ఇప్పుడు బీజేపీ మీదే వుంది. కాంగ్రెస్ వల్ల తమకు న్యాయం జరుగుతుందనే ఆశను సీమాంధ్రులు మర్చిపోయారు. ఉన్న చివరి ఆశ బీజేపీ మీదే! బిల్లులో సవరణలకు పట్టుబడతామని, ఇరు ప్రాంతాలకు సమన్యాయం తమ ఉద్దేశ్యమని బీజేపీ ప్రకటించింది. ఈమేరకు సవరణలను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. టి-బిల్లుకు బేషరతుగా మద్దతు తెలుపుతామన్న గత మాటలను కూడా వెనక్కి తీసుకుంది. సమన్యాయం జరక్కపోతే, కాంగ్రెస్ ప్రభుత్వానికి అది చేతకాకపోతే, తాము అధికారంలోకి వచ్చాక ఇరు ప్రాంతాల వారి అంగీకారంతోనే రాష్ట్ర విభజన చేస్తామని బీజేపీ అంటుంది. ఇదే జరిగితే ఇంతకంటే మంచి ప్రత్యామ్నాయం ఉండదు. సీట్ల కోసం తప్ప ఈ హడావిడి విభజన ఇంకోదానికి కాదు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలంటే ఇలాంటి అడ్డగోలు విభజనను బీజేపీ అడ్డుకోవాలి. పార్లమెంటులో టి-బిల్లు ఆగిపోతే ఇటు సీమాంధ్రలో అటు తెలంగాణలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతుంది. దేశవ్యాప్తంగా కూడా ఆ పార్టీకి ఇదే పరిస్థితి. తాము అధికారంలోకి వచ్చాక సంప్రదింపులు, సమన్యాయం ద్వారా విభజిస్తే బీజేపీకి ఆదరణ ఉంటుంది. కాంగ్రెస్‌కు శాశ్వత శత్రువుగా ముద్రపడిపోతుంది.



### బీజేపీ కోర్టులో బంతి

విభజనబిల్లు ద్వారా కాంగ్రెస్‌పార్టీ సీమాంధ్ర మీద ఎంత విషం చిమ్ముతుందో ఆ పార్టీకి తెలియనిది కాదు. ఇంతటి విషపూరితమైన బిల్లును బీజేపీ ఆమోదిస్తే చరిత్రలో క్షమించడానికి బీజేపీకి అర్హతుండదు. ఎందుకంటే సీమాంధ్రను హత్య చేయడానికి కాంగ్రెస్ సిద్ధపడింది. ఆ హత్యనాపగల స్థితిలో వుంది బీజేపీనే!

# 'అంతర్'జాతీయం

- మూడోకూటమి ఆవిర్భావానికి తమ పార్టీ కృషి చేస్తుందని జేడీయూ కన్వీనర్ శరద్‌యాదవ్ పేర్కొన్నారు. సైద్ధాంతిక విభేదాలున్నప్పటికి బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలను ఒకేతాటి మీదకు తెచ్చి ఈ కూటమిని ఏర్పాటు చేస్తామన్నారు. తమతో ఇప్పటికే ఎస్‌పి చేతులు కలిపిందన్నారు.
- హెలికాప్టర్ల కుంభకోణం అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని బీజేపీ నేతలు అరుణ్‌జైట్లీ, యశ్వంత్‌సిన్హాలు స్పష్టం చేసారు. ఇది మరో భోఫోర్స్ కుంభకోణం లాంటిదని వారు విమర్శించారు.
- భారత్ వరుసగా రెండోవన్డే సీరీస్‌ను కోల్పోయింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను 4-0తేడాతో ఓడిపోయింది. ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌ను మాత్రం టై చేసుకోగలిగింది.
- తుఫాన్‌ల రాకను ముందే పసిగట్టే సామర్థ్యమున్న 'మెక్‌డోనిల్ డగ్లస్ డిసి-8' రకం విమానాన్ని నాసా నుండి కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమైంది. ఈ విమానం 2016నాటికి వచ్చే అవకాశముంది.
- భారతీయ దౌత్యవేత్త దేవయాని వీసా మోసం కోసులో అభియోగాలు ఎదుర్కోకుండా దౌత్యపరమైన రక్షణ ఏమీ లేదని అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది.
- బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని అమెరికా విదేశీవ్యవహారాల శాఖ ఉపఅధికార ప్రతినిధి మేరీహార్ఫ్ తెలిపారు. అన్నింటి మాదిరిగానే ఆయన దరఖాస్తును కూడా పరిశీలించి వీసా మంజూరు చేయాలా వద్దా నిర్ణయిస్తామన్నారు.
- 2030 నాటికి కొత్తగా క్యాన్సర్ కేసులు సగం మేర పెరుగుతాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. 2012లో క్యాన్సర్ కేసులు 1.4కోట్లు ఉండగా 2030 నాటికి అది 2.16కోట్లకు చేరుతాయని పేర్కొంది. క్యాన్సర్ మరణాలు ఏటా 82లక్షలు ఉండగా 2030 నాటికి 1.3కోట్లకు పెరుగుతాయని వెల్లడించింది. ప్రపంచ జనాభాతో పాటు వృద్ధుల సంఖ్య పెరగడం, ముప్పు కలిగించే జీవన విధానాలకు ఎక్కువమంది అలవాటు పడుతుండడం క్యాన్సర్ పెరుగుదలకు కారణమని వివరించింది. పొగాకు ఉత్పత్తులు పెరగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ పెరుగుతున్నట్లు సమితి పేర్కొంది.
- కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ నివాసం ఎదుట 3వ తేదీ అకాలీదళ్, ఢిల్లీ సిక్కు గురుద్వారా నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో సిక్కులు ఆందోళన నిర్వహించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లలో పాల్గొన్న కాంగ్రెస్ నేతల పేర్లు వెల్లడించాలని వారు డిమాండ్ చేసారు.
- ఈ దఫా ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయపార్టీలే కీలకపాత్ర పోషిస్తాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ 3వ తేదీ ధన్‌బాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వెల్లడించారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ప్రభుత్వమే మద్యాన్ని ప్రోత్సహిస్తుంది. – లోక్‌సత్తా అధ్యక్షుడు జేపీ.
**వ్యాఖ్య :- *మరి ప్రభుత్వాన్ని సాకేది మద్యమేగా!***

వార్త :- తెదేపాతో పొత్తుకు అవకాశం లేదు. – ప్రకాశ్ కారత్.
**వ్యాఖ్య :- *వాళ్లు బీజేపీ కోసం వెంపర్లాడుతున్నారులే!***

వార్త :- హద్దులు మీరితే చర్యలు తప్పవు. – సచివాలయ ఉద్యోగనేతలకు సిఎస్ హెచ్చరిక.
**వ్యాఖ్య :- *అంటే ఇప్పటిదాకా మీరలేదనుకుంటున్నారా?***

వార్త :- ఆర్టికల్-3తో సీమాంధ్రపై అత్యాచారం. – దేశం నేత పయ్యావుల.
**వ్యాఖ్య :- *యూపిఏ ప్రభుత్వం పెద్ద రేపిస్టు అంటారు.***

వార్త :- ఎన్నికల వ్యయం పెంచండి. – ఈసీని కోరిన రాజకీయపక్షాలు.
**వ్యాఖ్య :- *ఓట్లు కొనుగోలు వ్యయాన్ని కూడా కలిపారా?***

వార్త :- కేంద్రం చేతిలో రాష్ట్ర భవిత. – కేంద్రమంత్రి చిరంజీవి.
**వ్యాఖ్య :- *ప్రజల చేతిలో తమ భవిత ఉందని మీరు అనుకుంటున్నట్లు లేదు.***

వార్త :- అందరి కలలు నెరవేరుద్దాం. – చంద్రబాబు.
**వ్యాఖ్య :- *తెలుగుదేశం పార్టీకి అధ్యక్షులు కావాలని చాలామంది కలలు కంటున్నారు... నెరవేరుస్తారా?***

వార్త :- వైకాపా దుకాణం మూతపడే రోజులు దగ్గర్లోనే. – సీఎం రమేష్.
**వ్యాఖ్య :- *వైకాపానా... తెదేపానా... కరెక్ట్‌గా చెప్పండి.***

వార్త :- అవినీతి వ్యతిరేక బిల్లులను అడ్డుకోకండి. – విపక్షాలకు రాహుల్ పిలుపు.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించడానికి ఏ బిల్లులూ సరిపోవులే!***

వార్త :- ఏదో ఒకటి తేల్చేయాలి. – తెలంగాణపై చిదంబరం.
**వ్యాఖ్య :- *సీమాంధ్రను చంపేయడానికి తొందరపడుతున్నారే!***

వార్త :- రాష్ట్రపతిభవన్ ఎదుట దుస్తులు విప్పేసిన జంట.
**వ్యాఖ్య :- *ఇదేమన్నా ఫారిన్ అనుకుంటున్నారేమో?***

వార్త :- కేంద్రం చేతిలో ప్రజాస్వామ్యం ఖూనీ. – సబ్బం హరి.
**వ్యాఖ్య :- *ఖూనీకోర్ పార్టీ చేతిలో అధికారం ఉంటే అంతే కదా!***

వార్త :- సీమాంధ్రకు న్యాయం చేయాల్సిందే. – బీజేపీ నేత వెంకయ్య.
**వ్యాఖ్య :- *ముందు అన్యాయం చేయకుండా చూడండి.***

# ఏసీబీ ట్రాప్‌లో సర్వేయర్

ఓ రైతు నుంచి రూ.10వేలు లంచం తీసుకున్న రాపూరు సర్వేయర్ లాలి వెంకటేశ్వర్లును ఈ నెల 1న పొదలకూరులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ భాస్కరరావు వివరాల మేరకు రాపూరు మండలం గండురుపల్లికి చెందిన రైతు గుండిగుంట బాలకృష్ణయ్య ఇరవై ఏళ్ళుగా ఏడు ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటున్నాడు. ఆ పొలానికి సంబంధించి తన కుటుంబంలోని నలుగురి పేర్లపై ఏడో విడత భూపంపిణీలో పట్టాలు పొందే ప్రయత్నంలో భూమిని సబ్‌డివిజన్ చేయాల్సి ఉండడంతో సర్వేయర్ వెంకటేశ్వర్లును కలిశాడు. ఎకరాకు రూ.2500/-లు ఇవ్వాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేసాడు. బతిమిలాడగా చివరకు ఎకరాకు రూ.2200/-లకు బేరం కుదిరింది. అడ్వాన్స్‌గా రూ.10వేలు చెల్లించాలని సూచించాడు. పొలాన్ని సబ్‌డివిజన్ చేయించుకునేందుకు లంచం ఇవ్వడం ఇష్టంలేని బాలకృష్ణయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సర్వేయర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా పొదలకూరులోని నూతనంగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు రావాలని వెంకటేశ్వర్లు చెప్పాడు. దీంతో రైతు బాలకృష్ణయ్య ఇంటి వద్దకు వెళ్ళి రూ.10 వేలు ఇచ్చాడు. అది తీసుకున్న వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వెంకటేశ్వర్లును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాపూరు కార్యాలయంలోని పలు రికార్డులను స్వాధీనం చేసుకుని నెల్లూరుకు తరలించారు.

# కందప్ప మేస్త్రి చిరస్మరణీయుడు



కందప్ప మేస్త్రీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివేకా

ఆరణి కందప్పమేస్త్రి జయంతిని ఈనెల4వతేదీ కందప్పమేస్త్రి సత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కందప్ప మేస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన ఆరణి కందప్ప పేదవాడైన ఒక బేల్దారి మేస్త్రీగా వుంటూ కట్టించిన సత్రం నేడు ఎంతో మందికి నీడనిస్తుందని, ఆయన చిరస్మరణీయుడన్నారు. స్థానిక కన్యకల ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం సేవానిరతితో కందప్ప ఈ సత్రాన్ని నిర్మించారన్నారు. అనంతరం విశ్వభారతి అంధుల పాఠశాలకు చెందిన అంధ విద్యార్థులకు యూనిఫారాలను పంపిణీ చేసారు. స్వయంఉపాధి కింద ఐదుమంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేసి, పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ ఏసి వేగూరు రవీంద్రరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శైలేంద్రకుమార్, వెంకటరమణ, సుధాకర్, సత్రం ఇఓ మధుసూదనరావు, వివిధ ఆలయాల ఈఓలు పాల్గొన్నారు.

# ఎన్నికల కోసం ముందస్తు కసరత్తు

ఎన్నికల కమీషనర్ ఆదేశాల మేరకు రాబోవు పార్లమెంట్, శాసనసభ ఎన్నికలకు సంబంధించి అధికారులు ముందుగా కసరత్తు ప్రారంభించారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 2449 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నాయా, లేవా తదితర అంశాలపైనా, విద్యుత్, ఫర్నీచర్ వెబ్ కెమెరాలు ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు, తాగునీటి వసతి వివరాలు సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకంపై వివరాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను సంబంధిత వీఆర్వోలు తనిఖీ చేసి ప్రస్తుతం వున్న వసతులు, కావల్సిన సౌకర్యాలపై నివేదికలను తయారు చేసి సంబంధిత అధికారులకు పంపాల్సి వుంది. దీంతో పాటు వీఆర్వోలు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఆ బూత్ నెంబరును గోడలపై నమోదు చేస్తున్నారు. వాటిని ఫోటో, వీడియో తీస్తున్నారు. ప్రతి మండలంలో పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుపుతూ రూట్ మ్యాపులను మండల తహశీల్దార్లు తయారు చేస్తున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల వివరాలను సేకరించి ఆర్డీవో ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఆయా మండలాల్లోని సిఐలు, ఎస్ఐలు తహశీల్దార్లతో సమావేశాలు నిర్వహించారు. సెగ్మెంట్లు వారీగా నెల్లూరు నగరం 205, నెల్లూరు రూరల్ 226, కోవూరు 276, ఆత్మకూరు 247, కావలి 244, సర్వేపల్లి 228, గూడూరు 249, వెంకటగిరి 261, ఉదయగిరి 264, సూళ్ళూరుపేట 249 పోలింగ్ కేంద్రాలను నిర్ణయించారు.

# శ్రీనేతాజీలో సామూహిక అక్షరాభ్యాసం



చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినమైన వసంత పంచమి సందర్భంగా ఈ నెల 4న నెల్లూరు శ్రీనివాస అగ్రహారం లోని శ్రీనేతాజీ(యంఎన్ఆర్) ఫైలెట్ స్కూలులో 3 ఏళ్ళ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం జరిపారు. పాఠశాలలోని కీర్తిభవన్‌లో సరస్వతీదేవి విగ్రహం వద్ద పాఠశాల కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసన్న, వైస్‌ప్రిన్సిపాల్ డి.వాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ అక్షరాభ్యాసం పట్ల సంతోషాన్ని ప్రకటించారు.

# నారాయణ విద్యార్థులకు అభినందనల వెల్లువ

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన నారాయణ స్కూల్ విద్యార్థులను నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం అభినందించారు. నెల్లూరు నగరం రామలింగాపురంలోని నారాయణ స్కూలులో జరిగిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రణ విద్యసాధన ఆత్మస్థైర్యం, దేహదారుఢ్యం మనోవికాసాన్ని కలిగిస్తుందన్నారు. నారాయణ విద్యాసంస్థల ఏజియం డి.రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్న సంకల్పంతో, చురుకుదనం కోసం వివిధ క్రీడల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. కరాటే మాస్టర్ ఎన్.వెంకటరమణ మాట్లాడుతూ మూడురోజుల పాటు నెల్లూరులో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొన్న దేవ్‌గోజుర్యూ కరాటే అసోసియేషన్ విద్యార్థులు 15 నుంచి 20 కిలోలు విభాగంలో కరాటే పోటీలో ఎన్.దోలేంద్ర శ్రీనివాసులు, కె.వంశీ, డి.కనిష్క, కె.సాయిప్రశాంత్, 25 నుంచి 35 కేజీల విభాగంలో తేజేందర్ సింగ్, ఎన్.సాయిప్రకాష్, వి.శశాంక్, కె.మహేష్, బంగారుపతకాలు, 35 నుంచి 50కేజీల విభాగంలో యు.మహేష్, ఆర్.హర్షవర్ధన్, బి.రాజ్‌కుమార్ రజత పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ రవిశర్మ, ప్రిన్సిపల్స్ మధుసూదన రెడ్డి, షీలారాణి, ఏఒడి రవిబాబు, కరాటే మాస్టర్ టి. ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఊపందుకున్న నిమ్మధరలు

నిమ్మకాయల ధరలు ఊపందుకోవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గూడూరు, పొదలకూరు నిమ్మ మార్కెట్లలో ధరలు కొద్ది మేర పెరిగాయి. ప్రతి ఏటా వేసవి కాలంలో ఢిల్లీ మార్కెట్ నిమ్మ ధరలకు కేంద్రంగా ఉంటుంది. ఈ నెల 1న గూడూరు మార్కెట్లో బస్తా రూ.2100/-లు పలుకగా, 2వతేదీ బస్తా రూ.1700లు నుంచి రూ.2400/-లు వరకు అమ్మకాలు జరిగాయి. దక్షిణాదిలోని చెన్నై, ఎర్నాకుళం, కేరళ తదితర ప్రాంతాల్లో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు సమాచారం.

# పుష్పగిరి మఠం స్థలం క్షేమం

కడప జిల్లా పుష్పగిరి మఠం వారికి చెందిన దాదాపు రూ.6 కోట్లు విలువ చేసే 62 సెంట్లు భూమిని ఎట్టకేలకు దేవాదాయశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖలు ఆక్రమణదారుల నుంచి విడిపించారు. నెల్లూరు ఇన్‌చార్జి తహశీల్దార్ సాంబశివరావు దగ్గరుండి సర్వేచేయించి ఆ మఠానికి చెందిన స్థలంలో ఎక్కడా శివాయి స్థలం లేదని తేల్చారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ వేగురు రవీంద్రరెడ్డి మఠం స్థలానికి కంచెనాటు వేయాలని తెలిపారు.

# ఎమ్మెల్యేలు...ప్రగల్భాలు ఆపండి

రెండున్నరేళ్ల క్రితం భూగర్భ డ్రైనేజీకి సిఎంతో శంకుస్థాపన చేయించి, దాన్ని పట్టించుకోకుండా కొత్త పథకాలకు శంకుస్థాపనలు చేస్తూ నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ప్రగల్భాలు పలుకుతున్నారని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. ఈ నెల 4న నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కొద్దిపాటి వర్షం వస్తే ట్రంకురోడ్డు ప్రాంతం నీట మునుగుతోందని, దాన్ని కప్పిపుచ్చుకునేందుకే రోడ్లపై రోడ్లు వేస్తున్నారని ఆరోపించారు. రూ.420 కోట్లతో మరో సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను నిర్మించనున్నామని ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని, దానికి ముందు నిర్మించిన ట్యాంక్ నీటిని తాగేందుకు ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కిలారి వెంకటస్వామి నాయుడు, ధర్మవరం సుబ్బారావు, నూనె మల్లికార్జున్‌యాదవ్, చిరంజీవినాయుడు, మున్వర్, శేషయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు బాగుండాలనే ఆకాంక్షే "ఇస్తిమా" నిర్వహణ

ప్రపంచంలోని ప్రజలందరూ బాగుండాలనే ఆకాంక్షే ఇస్తిమా నిర్వహణ ప్రధాన ఉద్దేశ్యమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురంలో జరుగుతున్న ఇస్తిమా ఏర్పాట్లను మంగళవారం వివేకా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖురాన్‌లోని ముఖ్య విషయాలను ప్రపంచానికి తెలియజేసేందుకు ఇస్తిమా ఒక వేదికన్నారు. ఈ కార్యక్రమానికి గుజరాత్ నుంచి 3, ఢిల్లీ నుంచి 2, మహారాష్ట్ర నుంచి 4 ప్రత్యేక రైళ్ళు నెల్లూరుకు రానున్నాయన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది బస్సుల్లో ముస్లింలు తరలి రానున్నారని తెలిపారు. దాదాపు 4లక్షల మంది వస్తారని అంచనావేస్తున్న నేపథ్యంలో ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. 29ఏళ్ళక్రితం జిల్లాలో నిర్వహించిన ఇస్తిమాకు లక్షమంది హాజరైతే, ఈసారి జరిగే ఇస్తిమాకు 4లక్షలు పైగా వస్తారన్నారు. జిల్లా కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి తెలియజెప్పే కార్యక్రమం అయినందున అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లీం పెద్దలు అబ్దుల్ వహాబ్, ఇలియాజ్ అహ్మద్ నిర్వాహకులు ఎండి.కరిముల్లా కాంగ్రెస్‌నాయకులు పులిమి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహశీల్దార్లకు పదోన్నతి

నెల్లూరు జిల్లాలో 17 మంది డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ సీసీఎల్ఏ ఈ నెల 4వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఆరు మందిని ప్రకాశం జిల్లాకు బదిలీ చేయగా, ఒకరిని నెల్లూరులోనే నియమించారు. మిగిలిన పది మందికి పోస్టింగ్ ఇవ్వాల్సివుంది. ప్రకాశంజిల్లాకు బదిలీ అయిన వారిలో రవీంద్రనాథ్ (మర్రిపాడు), బషీర్(రాపూరు), వెంకటేశ్వరరావు(కావలి), ఈశ్వరమ్మ (డీఆర్‌డిఏ), లియాఖత్ అలీఖాన్(నెల్లూరు తహశీల్దార్ కార్యాలయం), నాగేశ్వరరావు (కలెక్టరేట్‌లోని కోనేరు రంగారావు కమిటి) ఉన్నారు. నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సివి రాజేశ్వరరావును నెల్లూరులోనే నియమించారు. గుంటూరు జిల్లా నుంచి ఏడు మంది తహశీల్దార్లను, ప్రకాశం జిల్లా నుంచి 13 మందిని నెల్లూరు జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రపంచంలోనే అరుదైనది 'షార్' -శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్




షార్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.వరప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు విఆర్ కళాశాలలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎ రామూర్తి, డాక్టర్ సి.రమేష్‌కుమార్‌ల సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న షార్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ జాతీయ అభివృద్ధిలో అంతరిక్ష ప్రయోగాల పాత్ర ఎంతో వుందని, విద్య, కమ్యూనికేషన్స్, భూపరిశీలన, వాతావరణ అధ్యయనం, టెలిమెడిసిన్ మొదలైన రంగాలలో మనం ఎంతో పురోగతిని సాధించామని పేర్కొన్నారు. షార్ కేంద్రం ప్రపంచంలోనే అరుదైన రాకెట్ ప్రయోగ కేంద్రమని అన్నారు. మనదేశం ప్రయోగించిన ఉపగ్రహాల వివరాలతో కూడిన ఆయన ఉపన్యాసం విద్యార్థులు, అధ్యాపకులందరినీ ఆకట్టుకుంది. సభకు విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ అధ్యక్షత వహించగా విశిష్ట అతిథిగా విఆర్‌సి పాలకవర్గ కమిటీ ట్రెజరర్, సీనియర్ న్యాయవాది ఎన్.శ్రీనివాసులురెడ్డి, మరో విశిష్ట అతిథిగా విఆర్‌సి సిఈఓ పి.సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

తొలుత సభను స్వాగతిస్తూ ఫిజిక్స్ రీడర్ డాక్టర్ జి.కృష్ణకిషోర్ ఎస్ఎ రామూర్తి ఫౌండేషన్ స్థాపక, ఆశయాల గురించి వివరించారు. ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం షార్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్‌ను సభకు పరిచయం చేసారు. ఈ సందర్భంగా నలుగురు బిఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థులు టి.సతీష్‌బాబు, వి.వి.సుభాషిణి, టి.శ్రీనివాసులు, ఎస్.జగపతిబాబులకు డాక్టర్ వరప్రసాద్ ప్రశంసాపత్రాలు, స్కాలర్‌షిప్‌లను అందించారు.

కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు డా॥బి.వేమారెడ్డి, వి.వి.కృష్ణశర్మ, బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంతటా అదే చర్చ

పార్లమెంటులో తెలంగాణబిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో నెల్లూరు నగరంలో ఏ నలుగురు ఒక చోట కలిసినా దీనిపైనే చర్చ జరుగుతుంది. టీ క్యాంటీన్‌లలో సిగరెట్లు తాగుతూ కుర్రాళ్లు రాష్ట్ర విభజన గురించే మాట్లాడుతున్నారు. తెల్లవారు జామున గ్రౌండ్స్‌లో వాకింగ్‌చేసే పెద్దోళ్లు రాష్ట్రం విడిపోతుందా? అనే టెన్షన్‌తోనే మాట్లాడుతున్నారు. పార్కుల్లో కూర్చున్న వృద్ధుల టాపిక్ కూడా రాష్ట్ర విభజనే! ప్రతి ఒక్కరు కాంగ్రెస్‌పార్టీని తిట్టుకుంటూ కనీసం బీజేపీ అడ్డం తిరిగితే అయినా బిల్లు ఆగిపోతుందనే ఆశలో ఉన్నారు. కొందరైతే సోనియాగాంధీ, షిండే, దిగ్విజయ్‌సింగ్, దాసరి జైరాంరమేష్, పనబాక లక్ష్మి, చింతా మోహన్, చిరంజీవిలను పచ్చిబూతులే తిడుతున్నారు. వీరంతా కూడా కిరణ్‌కుమార్‌రెడ్డిని పొగుడుతుండడం విశేషం.

## రిచ్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స





శస్త్ర చికిత్స చేసిన బిడ్డ తల్లిదండ్రులతో డా॥ టి.రవికుమార్

అన్న వాహిక, శ్వాస వాయు నాళానికి మధ్య లోపాలతో జన్మించిన పురిటిబిడ్డకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు నెల్లూరు నగరం పొగతోటలోని రిచ్ హాస్పిటల్ డాక్టర్ టి.రవికుమార్ తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు జిల్లా వింజమూరు గ్రామానికి చెందిన తిరుప తయ్య, ఉమామహేశ్వరి దంప తులకు గతనెల 16వతేదీన జన్మించిన పురిటిబిడ్డ, పాలుత్రాగాక తాగిన పాలను వెంటనే వాంతి చేసుకోవడం, పాలు తాగేటపుడు నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలతో ఉన్న బిడ్డను గతనెల 19వతేదీన రిచ్ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారని తెలిపారు. ఆ బిడ్డను పరీక్షించగా ఊపిరితిత్తులు పూర్తిగా మూసుకుపోయి వున్నాయని, అన్నవాహిక పూర్తిగా లేదని అన్నవాహిక, వాయునాళం పూర్తిగా కలిసిపోయి, నోటి నుండి నురగరావడం, నీలంరంగులో ఉండ టంతో ఫీడింగ్ ట్యూబ్‌లోపలికి వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో తాము బిడ్డకు కృత్రిమ శ్వాసను అందించినట్లు తెలిపారు. తన ఆధ్వ ర్యంలో గతనెల 21వతేదీన చిన్న పిల్లల సర్జన్లు డా॥ సురేష్‌బాబు, డా॥ శివకుమార్, డా॥ గోవిందలు కలిసి ఈ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి బిడ్డ ప్రాణాలను కాపాడామన్నారు. అమె రికా వంటి దేశాలలో అరుదుగా విజయ వంతమయ్యే ఈ శస్త్రచికిత్సను విజయ వంతంగా చేయగలిగామన్నారు. ఈ ఖరీ దైన శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసినట్లు తెలి పారు. సమావేశంలో డాక్టర్ శివకుమార్, పురిటి బిడ్డ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వీఆర్వో, వీఆర్ఏ పరీక్షలు

నెల్లూరు జిల్లాలోని 94పరీక్షాకేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన వీఆర్వో, వీఆర్ఏ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. 45 వీఆర్వో పోస్టులకు 35,608 మంది దరఖాస్తు చేసుకోగా 31,932మంది 148 వీఆర్ఏ పోస్టులకు 2,352మంది దరఖాస్తు చేసుకోగా 2045మంది పరీక్షరాశారు. ఈ పరీక్షలకు అబ్జర్వర్లుగా 26మంది, లైజనింగ్ అధికారులుగా 36మంది, సహాయ లైజనింగ్ అధికారులుగా 94మంది విధులు నిర్వర్తించారు. ఈ రెండు పోస్టులకుగాను 37,960మంది అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోగా 33,977మంది హాజరయ్యారు. 3983మంది గైర్హాజయ్యారు. ఈ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చి అనుమతి లభించక కొంత మంది విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మరికొన్ని చోట్ల సరిగ్గా 10గంటలకు వచ్చినా అనుమతి లభించలేదనే ఆరోపణలు వినవచ్చాయి. మొదటిసారిగా పోటీపరీక్షలు రాసే అభ్యర్థులు ఒ.ఎం.ఆర్ పత్రాన్ని భర్తీచేయడంలో తికమకపడ్డారు. హాల్‌టికెట్టు నంబరు రాసిన తర్వాత ఆ నంబరు కింద కేటాయించిన గదుల్లో నెంబరును బబుల్ చేయాల్సి వుంది. సరైన అవగాన లేక చాలామంది తప్పుగా రాసారు. వీటిల్లో మార్పులు, చేర్పులు చేసే అవకాశం లేకపోవడంతో అభ్యర్థులు ఇన్విజిలేటర్ల వద్ద ఆవేదన వ్యక్తంచేసారు.

## నెల్లూరు కబుర్లు

## నెల్లూరుకు కొత్త డి.సి



నెల్లూరు డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమీషనర్‌గా తోట రాజ శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీక రించారు. కరీంనగర్ డివిజన్ డిసిగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. గుంటూరుజిల్లాకు చెందిన తోట రాజశేఖర్ మొదట విజయవాడలో సిటిఓగా శిక్షణ పొందారు. అనంతరం అమలాపురంలో సిటిఓగా పనిచేసారు. ఆ తర్వాత విశాఖపట్నం చిన్నవాల్తేరు సిటిఓగా పనిచేసారు. హైదరాబాద్‌లో అసిస్టెంట్ కమీషనర్‌గా చాలాకాలం బాధ్యతలు నిర్వర్తించారు. కరీంనగర్ డిప్యూటీ కమీషనర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు.

## ఇంగువ కార్తికేయశర్మ సేవలు అపూర్వం



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య అడపా సత్యనారాయణ

నెల్లూరు, వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో గత నెల 30న సాలార్‌జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ స్వర్గీయ ఇంగువ కార్తికేయశర్మ సంస్మరణ సభ జరిగింది. నెల్లూరు జిల్లా పల్లిపాడు గ్రామ వాస్తవ్యులైన కార్తికేయశర్మ సుప్రసిద్ధ శాసనపరిశోధకులు, పురాతత్వ శాస్త్రవేత్త. సంస్మరణ సభకు ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత చరిత్ర అధ్యాపకులు డాక్టర్ అడపా సత్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కార్తికేయశర్మ పురావస్తు పరిశోధనలో చేసిన సేవలను కొనియాడారు. ప్రధానవక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్కియాలజి & మ్యూజియంశాఖ విశ్రాంత ఉపసంచాలకులు డాక్టర్ ఎన్.ఎస్.రామచంద్రమూర్తి మాట్లాడుతూ కార్తికేయశర్మను బహుముఖప్రజ్ఞ కలిగిన పురావస్తుశాస్త్రవేత్తగా అభివర్ణించారు. కార్యక్రమంలో కార్తికేయశర్మ సోదరుడు ఇంగువ వెంకటరాఘవశాస్త్రి, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, వేదం వెంకట్రామన్, ఆచార్య ఆదిత్య, సీనియర్ న్యాయవాది పి.వి.రమణారెడ్డి, బి.వి.నరసింహం, చతుర్వేదుల శ్రీరామమూర్తి, కళాంజలి అనంత్, ఎన్.సుందరబాబులు పాల్గొన్నారు. వి.ఆర్.కళాశాల అధ్యాపకులు డా॥ ఎమ్.సుబ్రహ్మణ్యం సభను పర్యవేక్షించారు.

## దోమల బారి నుంచి కాపాడండి

**నగర కమీషనర్‌కు మాజీ చైర్మన్ అనూరాధ వినతి**

నెల్లూరు నగర ప్రజలను దోమలు నంచుకుంటూ నిద్ర లేకుండా చేస్తున్నాయని నెల్లూరు మునిసిపల్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ మహిళానేత తాళ్ళపాక అనూరాధ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 1న నగర పాలక సంస్థ కారాయలయంలో కమీషనర్ జాన్‌శ్యాంసన్‌ను కలిసి విన్నవించారు. తక్షణం చర్యలు తీసుకుని ప్రజలను దోమల బారి నుండి కాపాడాలని విన్నవించారు. నగరంలో పంట కాలువల్లో పూడిక తీయకపోవడంలో దోమలు విపరీతంగా పెరిగాయని ఫలితంగా ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. అనూరాధతో పాటు టీడీపీ నాయకులు ధర్మవరం సుబ్బారావు, వై.సుబ్బారావు, మున్వర్, పడవల కృష్ణమూర్తి, శమంతకమణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## కేశినేని బస్సు సీజ్

కేశినేని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఈ నెల 1వ తేదీన ఆర్టీఏ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్తున్న బస్సును నెల్లూరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్ బస్సుకు సంబంధించిన అనుమతి పత్రా లను తనిఖీ చేసారు. కాంట్రాక్ట్ క్యారియర్ కింద అనుమతి పొంది స్టేజి ఎక్స్‌ప్రెస్ క్యారియర్‌గా నడుస్తుండడంతో బస్సును సీజ్ చేసారు.

## బెల్టుషాపుల బెండు తీసారు

నెల్లూరు శివారులోని మూలాపేట, ఇరుకళల పరమేశ్వరి గుడి జొన్నవాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం లోక్‌సత్తా ఆధ్వర్యంలో మద్యం బెల్టుషాపులను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మక్కిన అంకయ్యచౌదరి మాట్లాడుతూ బెల్టుషాపులు నెల్లూరు నగరం శివారు ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయన్నారు. కార్పొరేషన్ కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ ఎక్సైజ్ సహకారం పోలీసుల ప్రోద్బలంతోనే పేదల కడుపుల్లో మందునింపి వారి జీవితాలు బుగ్గిపాలు చేస్తున్నారన్నారు. ప్రజారోగ్యం, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, పిల్లల భవిష్యత్తు గాలికొదిలి పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మహిళా సత్తా నేతలు పి.పుష్పలత, ఎస్.కవిత, ఎల్.కృష్ణవేణి లోక్‌సత్తా నాయకులు ఎంఎస్ మణియాదవ్, సిపీ బాబురావు వైవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల6 నుంచి జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ కొత్తగా ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 1న ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. సభ్యత్వ నమోదు కోసం జర్నలిస్టులు అక్రిడిటేషన్, యాజమాన్య గుర్తింపు కార్డుల జెరాక్సులు, రూ.135/-లును చెల్లించాలన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు శేషాచలపతి, వి.వెంకటేశ్వర్లు, వినోద్, రాజన్ పాల్గొన్నారు.



ఈ నెల 2వ తేదీ నెల్లూరు దర్గామిట్టలో నూతన జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పోలీస్ డిజిపి ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద మస్తాన్‌రావు, పరసా రత్నం, కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ తదితరులు

## ముసాయిదా బిల్లులో స్పష్టత లేదు

**- టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి**



ముసాయిదా బిల్లులో రాజధాని, నీరు, వేతనాలు, కరెంటు తదితర విష యాలపై ఏలాంటి స్పష్టత లేదని, ఇది మొండి బిల్లని, తలాతోక లేనిదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

నెల్లూరు నగరంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. మూజువాణితో నెగ్గిన బిల్లుకు చట్టబద్ధత లేదని తెలంగాణ ప్రాంత నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో పోడియం చుట్టుముట్టి సమావేశాలను అడ్డుకుంటున్నా ఆహార భద్రత, లోక్‌పాల్ బిల్లును మూజువాణి ఓటింగ్‌తో ఆమోదించిన విషయాన్ని దిగ్విజయ్‌సింగ్, జైపాల్‌రెడ్డి, సంఘ్వి, షిండేలు మరిచిపోయారా అని ప్రశ్నించారు. లోక్‌సభ, రాజ్యసభ స్పీకర్లుకు ఒక న్యాయం, శాసనసభ స్పీకర్‌కు మరొక న్యాయం వర్తిస్తుందా అని ధ్వజమెత్తారు. విభజన బిల్లు తిరస్కారం తప్పుడు నిర్ణయమని కొందరు కేంద్రమంత్రులు మాట్లాడడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ బిల్లు పై జైపాల్‌రెడ్డి వ్యాఖ్యలు శాసనసభ ఉల్లంఘన కిందకు వస్తాయన్నారు. రాష్ట్రపతి మీద తమకు అపారమైన నమ్మకం ఉందన్నారు. శాసనసభ తిరస్కరించిన బిల్లును రాష్ట్రపతి పార్లమెంటుకు పంపకుండా రాజ్యాంగ విలువలను కాపాడాలని, సీమాంధ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు.

GVK

Chhatrapati Shivaji International Airport

# లాయర్

## ప్రత్యేకశీర్షిక





## అనితరసాధ్య నిర్మాణం..

## భారతావనికి జి.వి.కె. బహుమానం...

# ముంబై ఎయిర్‌పోర్ట్

**ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-2.** ప్రపంచ విమానయాన రంగం మొత్తం చర్చించుకుంటున్న పేరు ఇది. ముంబైలో జివికె సారథ్యంలోని ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ నిర్మించిన ప్రపంచంలోనే అరుదైన అతి సుందరమైన అత్యాధునిక ఎయిర్‌పోర్టే ఈ ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(CSIA).

అతితక్కువ స్థలంలో ఘనమైన ఎయిర్‌పోర్ట్‌గా నిర్మించబడిన ఈ ప్రాంగణాన్ని జనవరి 31వతేదీ శుక్రవారం నాడు 'లాయర్' సందర్శించింది. ప్రపంచమంతా చర్చించుకుంటున్న ఈ అద్భుత కట్టడాన్ని రూపొందించింది మన నెల్లూరీయులు కావడంతో ఈ ప్రదేశాన్ని స్వయంగా చూసి ఇక్కడి వింతలు విశేషాలు 'లాయర్' పాఠకులకు అందించడమే కాకుండా ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన నెల్లూరీయుల ప్రతిభాపాటవాలను ప్రపంచ వ్యాప్తంగా వున్న "లాయర్" అభిమానుల కంప్యూటర్ స్క్రీన్‌లపై ఆవిష్కరించాలనే ప్రయత్నంచేసింది మా(మీ) 'లాయర్'.

ఎయిర్‌పోర్ట్‌ని చేరుకోవడానికి నిర్మించబడిన 6లైన్ల 3.2కిలోమీటర్ల ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో మొదలుకొని ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో తీసుకున్న జాగ్రత్తలు, పాటించిన నాణ్యతా విలువలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

(మిగతా 10వ పేజీలో)











# జయహో... జి.వి.కె.

**జయహే, జివికె న్యూ మ్యూజియమ్, ముంబై.** ఇదీ ఈ ఎయిర్‌పోర్టులో మనకు కనిపించే బోర్డు. ఇదే ఈ విమానాశ్రయ రూపకల్పనలో ముఖ్యంగా పాటించిన థీమ్. జాతీయ అంతర్జాతీయ ప్రయాణీకులు ముంబై విమానాశ్రయంలో కాలుపెట్టిన వెంటనే ఎన్నో వింతలూ విశేషాలూ మనకు కనిపిస్తాయి. భారతదేశంలోని అన్ని భాషలలో ముంబైకి స్వాగతం అనే బోర్డు మనకి దర్శనమిస్తుంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణీకులు ఇమిగ్రేషన్ కొరకు వెచియుండే క్యూలైన్లకు ఎదురుగా అతిభారీ స్థాయిలో ఈ బోర్డు మనకు స్వాగతం పలుకుతుంది.

ఇక భారతదేశ జాతీయ పక్షి నెమలి ఆధారంగా నిర్మించిన ఈ ప్రాంగణమంతా ఆ థీమ్ మనకి స్పష్టంగా కనిపిస్తుంది. పదకొండు ఎకరాల విస్తీర్ణం కలిగిన అతి భారీరూఫ్‌కి కేవలం 30కాలమ్స్‌ని మాత్రమే వినియోగిస్తే ప్రతి కాలమ్‌లోనూ నెమలిపింఛం ఆకారం స్పష్టంగా కనబడేలా ఆర్కిటెక్చర్ డిజైన్‌ను రూపకల్పన చేసి నిర్మించారు.

దాదాపు 30వేల చదరపుఅడుగుల విస్తీర్ణంలో పైకప్పుకోసం వాడిన అద్దం(గ్లాస్) ద్వారా సూర్యకాంతి నేరుగా ఎయిర్‌పోర్టు భవన ప్రాంగణంలో ప్రసరించి, పగటి పూట అద్భుతమైన వెలుగులో ఈ ప్రాంతం మెరిసిపోతుంటుంది. ఒక విధంగా పగటిపూట అధికస్థాయిలో విద్యుత్‌శక్తిని పొదుపుచేయడానికి ఈ ప్రయోగం ఎక్కువగా ఉపయోగపడుతుంది.

## ఆకట్టుకునే అలంకరణలు:

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు కళ్ళకు కట్టినట్లుగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ అన్ని ప్రాంతాల కళారూపాలను భారతదేశ ప్రఖ్యాత కళాకారులచే రూపొందింపజేసి ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.

ఈ ఎయిర్‌పోర్టులో వున్నప్పుడు మనం ఎయిర్‌పోర్టులో వున్నామా లేక భారతదేశ సంప్రదాయాలన్నీ ఒక్క చోటకు చేర్చిన ప్రదర్శనాలయంలో వున్నామా అన్న భావన ఇక్కడ ప్రతి ఒక్కరికీ కలిగేలా తీర్చిదిద్దారు. పంచ భూతాలూ, దశావతారాలు, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో సహా ఒక్క దక్షిణ భారతదేశమే కాకుండా యావత్ భారతదేశ సంస్కృతి ఈ ఎయిర్‌పోర్టులో మనకు కనిపిస్తుంది.

సుప్రసిద్ధ కళాకారులు బైజు పార్థన్, జగన్నాథపాండా, లలిత్, కపిల్‌శర్మ, మితుసేన్, మోరేశ్వర్‌పాటిల్, అనిల్‌నాయక్, షర్మిల సమంత్ వంటి దిగ్గజాలు జయహే పేరుతో మూడు కిలోమీటర్ల పొడవున్న 3 అంతస్థుల గోడపైన ఆకర్షణీయమైన కళాత్మక చిత్రాలతో, కళాప్రదర్శనలతో భారతదేశ కీర్తిని ప్రస్ఫుటింప జేసేలా రూపొందించిన విధానం బహుశా ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రయోగంగా పేర్కొనవచ్చు. మన దేశ ఖ్యాతికి ప్రతిరూపంగా ఈ ప్రదర్శన నిలుస్తుంది.

# ఆద్యంతం ఆహ్లాదం

దేశీయ లేదా అంతర్జాతీయ ప్రయాణీకులు కేవలం తమ విమానాల సమయానికి గంట లేదు రెండు గంటలో ముందు రాకుండా కనీసం 5గంటలైనా ముందొచ్చి జి.వి.కె ఏర్పాటు చేసిన కళాచిత్రాలను చూడాలనే ఆకాంక్ష కలిగేలా ఈ ఎయిర్‌పోర్టు రూపకల్పన జరగడం ఓ ఎత్తైతే, వచ్చిన ప్రయాణీకుడు ఎక్కడా ఎక్కువసేపు క్యూలైన్లలో నిరీక్షించకుండా త్వరితగతిన వెయిటింగ్ హాల్స్‌లోకి విచ్చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదదీరేలా 208 చెక్ ఇన్ కౌంటర్లను వాటితో పాటు 23జాతీయ 30అంతర్జాతీయ సెక్యూరిటీ చెక్‌గేట్లను అలాగే విమానాల రాకపోకలతో కూడా ఆలస్యం అంతరాయం కలుగకుండా 52ఏయిరో బ్రిడ్జిలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

ముఖ్యంగా అంతర్జాతీయ ప్రయాణీకులు భారతదేశం నుండి తరలివెళ్ళేటప్పుడు లేదా భారతదేశంలో అడుగుపెట్టేటప్పుడు తప్పనిసరిగా దాటాల్సిన ఇమిగ్రేషన్ కౌంటర్లను అత్యధిక స్థాయిలో వెళ్ళేవారి కోసం 60 వచ్చే వారికోసం 72 ఏర్పాటుచేసి భారతదేశంలో అడుగుపెట్టాలనుకున్న ఏ ప్రాంతంవారైనా ఒక్కసారి ముంబై ఎయిర్ పోర్టును ఎన్నుకుంటే ఇక ఎప్పటికీ వారు ముంబైకే రావాలనుకునేంతటి తియ్యటి అనుభవాలను అనుభూతులను మిగిల్చే విధంగా ఇక్కడ సదుపాయాలను కల్పించారంటే అతిశయోక్తి కాదేమో.

బయటదేశాలకు వెళ్ళేవారు సైతం త్వరితగతిన తమ సెక్యూరిటీ ఫార్మాలిటీస్ అన్ని ముగించుకున్న వెంటనే ఇమిగ్రేషన్ పూర్తి చేసుకుని సేదతీరడానికి కావలసినంత సమయం మిగిలేలా ఏర్పాటుచేశారు.

## ఇదో అందమైన ఉద్యానవనం:

దాదాపు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చెట్లను, పూలమొక్కలను ఏర్పాటుచేశారు. ఇక ప్రతి విమానం బోర్డింగ్ గేట్ వద్ద సైతం సహజ మొక్కలతో కూడిన బ్యాక్‌డ్రాప్‌ను ఏర్పాటుచేసి పరిసరాల్లో మొత్తం పూలమొక్కలతో నింపేశారు. ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో ఎక్కడ సేదదీరినా సహజ వాయువుతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి కూడా జివికె సంస్థ అత్యంత ప్రాధాన్యత కల్పించింది. ఈ కార్యక్రమం కోసం వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన వారిచే ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి కేవలం పచ్చదనంతో కూడిన పరిశుభ్రత కోసం ఆ శాఖను కేటాయించడం గమనించదగిన విషయం.























# జి.వి.కె. బహుమానం

(7వ పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోకి మనం ప్రవేశిస్తూనే మనకు కుడివైపున 5200 కార్ల పార్కింగ్ కోసం నిర్మించిన పది అంతస్తుల మల్టిలెవల్ పార్కింగ్ భవనం దర్శనమిస్తుంది. ఇప్పటివరకూ ప్రపంచంలో నిర్మితమైన అనేక ఎయిర్ పోర్టుల్లో కేవలం 2అంతస్తులకే పరిమితం కాగా ఈ ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 4అంతస్తులలో నిర్మించ బడింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణీకుల డిపార్చర్ కోసం 4వ అంతస్తులో ఏర్పాటుచేసిన 8 భారీ ముఖద్వారాలు ప్రయాణీకుడికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిరీక్షణా కాల వ్యవధిని తక్కువ చేసే విధంగా రూపొందించారు. అదే విధంగా 3వ అంతస్తును జాతీయ (డొమెస్టిక్) ప్రయాణీకుల డిపార్చర్ కోసం భవిష్యత్తులో వినియోగించనున్నారు. ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానం చేస్తూ నిర్మించిన 6లైన్ ఎలివేటెడ్ మార్గాన్ని ఎక్కడిక్కడే విడదీస్తూ, వచ్చే వెళ్లే ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎంట్రీ, ఎగ్జిట్‌లను ఏర్పాటుచేసి ఎక్కడికక్కడ ఏర్పాటుచేసిన సైన్‌బోర్డుల ద్వారా ప్రదేశాలను గుర్తించడం సులభతరం చేసారు.

ముఖద్వారం నుండి లోపలకి వెళ్లిన దగ్గర నుండీ ఈ విమానాశ్రయంలోని ప్రతి విభాగం ఓ వింతైన అనుభూతిని మనకి కలిగిస్తుంది. వచ్చే, వెళ్లే ప్రయాణీకులను స్వాగతించడం కోసం లేదా టాటా చెప్పడం(సెండాఫ్) కోసం ఏర్పాటు చేసిన లాబీలు ముందుగా దర్శనమిస్తాయి.

ఈ లాబీలను సైతం ఎక్కడా రాజీపడకుండా తీర్చిదిద్దారు. ప్రతి ప్రయాణీకుడు అతనితోపాటు వచ్చే బంధుమిత్రులు ప్రశాంతంగా తమవారిని రిసీవ్ చేసుకోవడానికి లేదా సెండాఫ్ ఇవ్వడానికి వీలుగా భారీస్థాయిలో సీటింగ్‌వసతితో పాటు ఇక్కడ కూడా షాపింగ్, ఫుట్‌కోర్ట్స్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఇక ముఖ్య ప్రాంగణంలో అడుగుపెట్టినప్పటి నుండీ ఈ ఎయిర్‌పోర్టులో అన్నీ ప్రత్యేకతలే. అంతా విశేషాలే. ఇవన్నీ ఒక్కొక్కటిగా 'లాయర్' పాఠకులకు అందించే ప్రయత్నమే ఈ ప్రత్యేక శీర్షిక.

ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో జి.వి.కె.రెడ్డి ఆయన కుమారుడు జి.వి. సంజయ్‌రెడ్డి చూపించిన శ్రద్ధ, వారు ప్రతి విషయంలోనూ కనపరచిన ఆసక్తి ఈ ప్రాంగణంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచేస్తుందంటే అతిశయోక్తి కాదు. బహుశా ఈ ఎయిర్‌పోర్టును ప్రపంచ వింతల్లో ఒకటిగా భావితరాలవారు పేర్కొంటే మనం ఆశ్చర్యపోనక్కరలేదు. అంతటి కళా నైపుణ్యంతో, దూరదృష్టితో శ్రద్ధాశక్తులతో ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరిగింది.

నెల్లూరీయులుగా మనమే కాదు ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రతి భారతీయుడు తమ దేశం గురించి గొప్పగా చెప్పుకునే తరుణంలో తప్పక పేర్కొనదగిన అంశంగా ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరిగింది. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన నిర్మాణం. ప్రతి నెల్లూరీయుడు సంతోషించవలసిన సందర్భం.

# అన్నింటా గొప్పే

నిత్యం రద్దీగా వుండే ముంబై ఎయిర్‌పోర్టులో ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వున్నది వున్నట్లుగానే వుంచి అదే ప్రాంతంలో కొత్త ఎయిర్‌పోర్టును ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకంగా 5500కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన ఘనత జివికె సంస్థది. యేడాదికి సుమారు 4కోట్ల మంది ప్రయాణీకులు ఎలాంటి అసౌకర్యం లేకుండా సులభతరంగా ప్రయాణించే స్థాయిలో ఈ టెర్మినల్-2ని రూపొందించారు.

ఎయిర్‌పోర్టు మొత్తం ఎగిరే భారత చిహ్నం మన జాతీయ పక్షి నెమలి ఆధారంగా నెమలి పింఛం స్ఫూర్తిగా నిర్మించారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దాదాపు వెయ్యికి పైగా షాండిలైట్స్‌ని తామర పువ్వు ఆధారంగా చూడగానే లోటస్ గుర్తొచ్చేలా ప్రత్యేకంగా తయారుచేయించి బిగించారు.

విదేశాల నుండి మన దేశంలో అడుగుపెట్టే ప్రయాణీకులకు దీపాలతో స్వాగతం పలికే విధంగా 10వేల దీపాలతో రూపొందించిన "దియాకర్టన్" ఈ ఎయిర్‌పోర్టులో మరో విశేషం.

టెర్మినల్ తూర్పు, పడమర వైపు వున్న అద్దాల ద్వారా వచ్చే సూర్య కిరణాల వేడిని నిరోధించే విధంగా ప్రత్యేక టెక్నాలజీ ద్వారా తయారుచేసిన ప్యానల్స్‌ను వుపయోగించారు.

జాతీయ అంతర్జాతీయ మల్టీబ్రాండెడ్ షాపింగ్‌మాల్స్‌తో పాటుగా మన దేశంతో పాటు ఇతర దేశాలతో లభించే వివిధ రకాల ఆహారాలు లభించే ఫుడ్‌కోర్టులను ఈ ఎయిర్‌పోర్టులో ఏర్పాటుచేశారు.

ఎయిర్‌పోర్టు ముఖద్వారం వద్ద ఏర్పాటుచేసిన అతి భారీ జాతీయ జెండా 24గంటలూ రెపరెపలాడేలా భారతప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతిని పొంది ఎగుర వేశారు. భారతదేశ ఖ్యాతిని భారతీయుడి సత్తాని జాతికి తెలియజేసే విధంగా ఈ మువ్వన్నెల జెండా ఎప్పుడూ ఇక్కడ రెపరెపలాడుతూనే వుంటుంది.

భావిభారత తరాలకు ఎప్పటికీ గుర్తుండిపోయే తీపి జ్ఞాపకంగా ఒక చిరస్మరణీయ కట్టడంగా ఈ ఎయిర్‌పోర్టును నిర్మించారు.

ఒక్క నెల్లూరు జిల్లావాసులే కాదు యావత్ భారతావని గర్వించే స్థాయిలో ఈ చత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-2 రూపొందించిన జి.వి.కృష్ణారెడ్డి, ఆయన కుమారుడు జి.వి.సంజయ్‌రెడ్డిలు ధన్యజీవులైతే అంతటి మేధావులకు జన్మనిచ్చిన నెల్లూరు పుణ్యభూమే.






























# దైవచింతనతోనే జీవితం ఆనందమయం

**--- కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ---**


జయేంద్రసరస్వతి ఆశీస్సులందుకుంటున్న వివేకా

దైవచింతనతోనే జీవితం ఆనందమయంగా ఉంటుందని కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి పేర్కొన్నారు. నెల్లూరు మూలాపేటలోని శంకర మఠంలో జరుగుతున్న శ్రీకామాక్షిదేవి సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో ఈనెల 2న స్వామిజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ తాను అనేకసార్లు నెల్లూరు వచ్చానని, ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి స్వామిజీకి మేల్‌చాట్ వస్త్రం, పూలు, ఫలాలు సమర్పించి, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో జయేంద్ర సరస్వతి పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో శంకరమఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్, డాక్టర్ వై.నాగదేవిప్రసాద్, ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# హోమీబాబా అవార్డునందుకున్న సతీష్‌రెడ్డి



ఆత్మకూరు మండలం మహిమలూరు వాసి డిఆర్‌డిఓ రీసెర్చ్ సెంటర్ ఇమారత్ డైరెక్టర్ సతీష్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన హోమీ జె.బాబా స్మారక అవార్డును అందుకున్నారు. 3వ తేదీ జమ్మూలో జరిగిన 101భారత సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో చేసిన కృషికి, రక్షణ పరిశోధనలో క్లిష్టమైన ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. దేశ రక్షణలో తనవంతు సేవలందిస్తూ ప్రతిష్టాత్మక అవార్డునందుకున్న సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# 10న మోడీ ఫర్ పీఎం సభ


సదస్సులో ప్రసంగిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరులోని కస్తూరిబా గార్డెన్స్‌లో ఈ నెల 10వ తేదీన మోడీ ఫర్ పీఎం సభ నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డిలు తెలిపారు. దాదాపు 10వేల మందికి పైగా కార్యకర్తలు తరలి వచ్చే ఈ సభకు అన్ని వర్గాలకు చెందిన జిల్లా ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ నెల 1న నెల్లూరు వేదాయపాళెం సెంటర్ వద్దనున్న కల్యాణ మండపంలో భారతీయ జనతా పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రెండు విడతలుగా జరిగిన గ్రామదర్శన్ కార్యక్రమంలో 600 గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేసారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు మిడతల రమేష్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్యం, జెట్టి రామచంద్రారెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జొన్నవాడలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలోగల వృద్ధులకు ఇటీవల నెల్లూరులోని పెద్దాసుపత్రిలో కంటి ఆపరేషన్‌లు నిర్వహించారు. ఆ ఆశ్రమ నిర్వాహకురాలు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మంజులమ్మలు ఈ ఆపరేషన్‌లు చేసారు. ఈ సందర్భంగా ఆపరేషన్‌లు చేయించుకున్న వృద్ధులతో అరుణమ్మ

# పోలీస్ బాస్ సుడిగాలి పర్యటన


పోలీసు అధికారుల సంఘం సభ్యులతో డిజిపి ప్రసాదరావు దంపతులు

రాష్ట్ర డీజీపీ ప్రసాద్‌రావు నెల్లూరులో శని, ఆదివారాల్లో సుడిగాలి పర్యటన జరిపి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం నెల్లూరు కొండాయపాళెం గేటు ప్రాంతంలోని పోలీసు బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన క్యాంప్‌ను డిజిపి ప్రసాద్‌రావు ఆయన సతీమణి సౌమిని సందర్శించారు. అనంతరం క్యాంప్‌లో ఏర్పాటు చేసిన ఫోటోగ్యాలరీ, పలు వీడియో డాక్యుమెంటరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా క్యాంప్ ఉందని, ఇది దేశానికే ఆదర్శమన్నారు. ఇదే తరహాలో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తే పోలీసుల కీర్తి తారాస్థాయికి చేరుతుందన్నారు. ఆదివారం పోలీసు పరేడు గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బంది డిమొబలైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న సమైక్యాంధ్ర ఆందోళనలు, ధర్నాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఏఆర్ సిబ్బంది సివిల్ పోలీసులకు సహాయ సహకారాలు అందిస్తూ నిబద్ధతగా పనిచేస్తున్నారని కొనియాడారు. డిమొబలైజేషన్ కార్యక్రమం ద్వారా ఏఆర్ సిబ్బంది తమ వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని శాంతిభద్రతల పరిరక్షణలో తమవంతు కృషి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బంది కోసం నిర్మిస్తున్న విశ్రాంతి భవనానికి డీజీపీ ప్రసాదరావు, ఆయన సతీమణి సౌమిని చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం నెల్లూరు జిల్లా టిపి గూడూరు మండలం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ ప్రసాద్ భార్య పుట్టమ్మకు డీజీపీ దంపతులు రూ.1.50 లక్షల చెక్కును పోలీసు అధికారుల సంఘ కార్యాలయంలో అందజేసారు. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో డీజీపీ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసాదరావు మాట్లాడుతూ పోలీసు పిల్లలందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు డీజీపీ దంపతుల చేతుల మీదుగా రివార్డులు అందజేసారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని డీజీపీ దంపతులు ప్రారంభించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం పాటు పడే పోలీసు సిబ్బందికి ఇటువంటి వైద్యశిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐజి వివి సునీల్‌కుమార్, డీఐజి, ఇన్‌ఛార్జి ఎస్పీ పివియస్ రామకృష్ణ, ఏఎస్పీలు, ఐఆర్‌ఎస్ మూర్తి, రెడ్డిగంగాధర్, డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, రాంబాబు, బాల వెంకటేశ్వర్లు, శివారెడ్డి, సూరిబాబు, సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# క్రమశిక్షణతో అత్యున్నత స్థానాలు

**- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**


చిన్నారులకు కిట్స్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

సేవాదృక్పథంతో తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతియేటా కూడా క్రమం తప్పకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం ఆయా స్కూళ్ల విద్యార్థులకు వారికవసరమయ్యే స్టేషనరీ, ఇతర సామాగ్రితో కిట్స్‌ను అందజేస్తుంటారు. ఈ పరంపరలో భాగంగానే ఇటీవల స్వీపింగ్ చిల్డ్రన్ అరౌండ్ ద వరల్డ్ (ఎస్‌సీఏ డబ్ల్యూ) ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీచేసారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రతిభావంతులుగా రాణిస్తారన్నారు. ఏటా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంపికచేసిన పాఠశాలల్లో 600మంది విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తొలుత ప్రభాకరరెడ్డితో పాటు విదేశీయులు, అతిథులకు విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి, కెనడా దేశీయులు, జడ్పీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను పూర్తిచేయాలి



బ్యాంకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీహాలులో కార్పొరేషన్ బ్యాంకర్లతో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎస్.హెచ్.జి.బ్యాంక్ లింకేజ్ కార్యక్రమాన్ని అర్హులైన గ్రూపు అధికారుల సమన్వయంతో కార్పొరేషన్, మునిసిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక గ్రూపులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పట్టణాలలోని స్వయం సహాయక గ్రూపులకు మెప్మా ఆధ్వర్యంలో 3,833గ్రూపులకు 785కోట్లు రుణాల లక్ష్యంగా, 2302గ్రూపులకు 62కోట్లు మంజూరు చేసాయన్నారు. మిగిలిన లక్ష్యాలను పూర్తిచేయడంలో బ్యాంక్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బోగస్ రుణాలను తీసుకున్న వారిని గుర్తించి కేసులు నమోదుచేసి తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు, మెప్మా పిడి కమలకుమారి, బిసి కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు, హౌసింగ్ పిడి వెంకటేశ్వర్‌రెడ్డి వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు..
## ప్రజలతో మమేకమవ్వాలి

**- ఎస్పీ రామకృష్ణ**

పోలీసులు ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలని ప్రజాసేవే ప్రథమ కర్తవ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకుంటూ పనిచేసి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని నెల్లూరుజిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ పిలుపునిచ్చారు. 15రోజులుగా జిల్లా పోలీసు పరేడు గ్రౌండులో జరుగుతున్న ఏఆర్ మొబలైజేషన్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ రామకృష్ణ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ ఐఆర్‌ఎస్ మూర్తి, ఏఆర్, నగర డిఎస్పీలు టి.శివారెడ్డి, పి.వెంకటనాథ్‌రెడ్డి, ఏఆర్ ఆర్ఐ కె.శ్రీనివాసరావు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# టీ-నేతలు భయపడిందెవరికి?

## దోమల కథలు

అది సమైక్యసింగం ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయం. పార్టీలకతీతంగా సీమాంధ్ర నాయకులందరితో ఆయన సమావేశం ఏర్పాటు చేసారు. కాంగ్రెస్ నుండి ఆనం రామనారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ, రఘువీరారెడ్డి, గంటా శ్రీనివాసరావు, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, టి.జి. వెంకటేష్, గాదె వెంకటరెడ్డి, లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, హర్షకుమార్, తెలుగు దేశం నుండి పయ్యావుల కేశవ్, గాలి ముద్దుకృష్ణమ నాయుడు, టి.వి.రామారావు, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, వైకాపా నుండి భూమన కరుణాకర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిలు హాజరయ్యారు.

కిరణ్ మాట్లాడుతూ కలిసి ఉంటే కలదు సుఖం అని చాలామంది చెబుతుంటే ఏదో అనుకున్నాను గాని, దానివల్ల లాభమేంటో నిన్ననే తెలిసింది. మొన్న అసెంబ్లీలో మనమంతా కలిసికట్టుగా ఉండబట్టే టి-బిల్లును తిరస్కరించి పంపగలిగాం. ఈ టెక్నిక్‌ను మొదటి నుండి ఫాలో అయ్యుంటే పోయిండేదన్నాడు. అప్పుడు భూమన కరుణాకర్‌రెడ్డి లేచి... మేం మొదటి నుండి చెబుతున్నదేగా.. బిల్లును చర్చించకుండా తిరస్కరించి పంపమన్నాం, మీరే మా మాట వినకుండా సగం చర్చించాక తిరిగి పంపారని చెప్పాడు. అప్పుడు సోమిరెడ్డి లేచి... మీరు పైకి మాత్రమే సమైక్యవాదులు, లోపల మాత్రం విభజన కోరుకుంటున్నారు. మీ జగన్, సోనియాతో కుమ్మక్కై వచ్చాడు. ఇక్కడ బిల్లును తిరస్కరించి పంపినా పార్లమెంటులో పెడతారని తెలుసు. అందుకే నిఖార్సయిన సమైక్యవాదుల్లాగా ఫోజిచ్చారు. కాని మా చంద్రబాబే అమాయకుడు. రెండుకళ్ల సిద్ధాంతాన్ని పట్టుకుని ఊగులాడుతున్నాడు. రెండుకళ్ల సిద్ధాంతాన్ని ఏ ముహూర్తాన పెట్టుకున్నాడోగాని, రెండుకళ్లకు అద్దాలు పెడుతున్నాడు. ఆయనను చూసేవాళ్లు మేధావి అంటుంటారు గాని నా దృష్టిలో మాత్రం పెద్ద అమాయకచక్రవర్తి. ఏ నిముషంలో ఏ స్టెప్ వేయాలో తెలియని అజ్ఞాని అని చెప్పాడు. ఆయన చంద్రబాబును పొగిడాడో లేక రాజ్యసభ సీటును ఎగ్గొట్టినందుకు తిట్టాడో పయ్యావుల కేశవ్‌కు అర్థంకాక తలగోక్కున్నాడు. వెంటనే ఆనం రామనారాయణరెడ్డి లేచి... మీ చంద్రబాబు అమాయకుడన్న మీ అమాయకత్వాన్ని చూసి నాకు జాలేస్తుంది. రాష్ట్ర విభజనకు మేము అనుకూలమంటూ లేఖ ఇచ్చిమరీ చిచ్చుపెట్టింది మీ చంద్రబాబే. ఆయన లేఖ ఇవ్వకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రాష్ట్రాన్ని విభజించాలన్న తలతిక్క ఆలోచన మా సోనియాగాంధీకి వచ్చి వుండేది కాదు. మీ చంద్రబాబు లేఖ ఇవ్వడం వల్లే మా సోనియాగాంధీ రాష్ట్ర విభజనకు మూర్ఖంగా పోయారని అన్నాడు. దాంతో తెలుగుదేశం నాయకులు... చేసిందంతా చేసి మా చంద్రబాబుపై నిందలేస్తారా అంటూ వాదనకు దిగారు. దాంతో కాంగ్రెస్ వాళ్లు కూడా... మా సోనియాకు అహంకారం వుందేగాని, మీ చంద్రబాబు లాగా కుళ్లు, కుతంత్రాలు లేవంటూ గొడవకు దిగారు. మేం ఖాళీగా ఎందుకుండాలంటూ మధ్యలో వైకాపా నాయకులు లేచి రెండు పార్టీల వారితో గొడవపడసాగారు. అప్పుడు కిరణ్ ఆవేశంగా... ఆగండి... అని అరిచి... ఇలా మనం తన్నుకోవడం వల్లే విభజనపై కేంద్రం తన పని తాను చేసుకుపోతుంది. బిల్లును తిరస్కరించి పంపగానే మనం విజయం సాధించినట్లు కాదు, రేపు ఢిల్లీలోనూ మనం కలిసికట్టుగా పోరాడి విజయం సాధించాలి. సమైక్యాంధ్ర కోసం మనం తాత్కాలికంగానన్నా కలిసి వుండాలి. మొన్న అసెంబ్లీలో మన సీమాంధ్ర ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా వ్యవహరించారు. స్పీకర్ చేతిలో సమైక్యతీర్మానం కాపీని లాక్కుని చించేయాలన్న తెలంగాణ ఎమ్మెల్యేలను బలంగా అడ్డుకున్నారు. స్పీకర్ వద్దకు వాళ్లు రావాలంటేనే భయపడ్డారు. ఇలా అసెంబ్లీలో బిల్లును తిరస్కరించి పంపడానికి సహకరించిన ఎమ్మెల్యేలందరికీ ఇక్కడ సన్మానం ప్రోగ్రాం పెట్టాను. అందుకే శాలువాలు, పూలదండలు భారీగా తెప్పించానని వాటిని చూపించాడు. అప్పుడు తెలుగుదేశం ఎమ్మెల్యే టి.వి.రామారావు లేచి మొదటి సన్మానం నాకే ఉండాలి, ఎందుకంటే హరీష్‌రావును స్పీకర్ దగ్గరకు పోకుండా గట్టిగా పట్టుకున్నది నేనే.. అని చెప్పాడు. లేదు.. మేం స్పీకర్‌కు రక్షణగా కవచంగా నిలిచాం... కాబట్టి మొదట మమ్మల్నే సన్మానించాలని కాంగ్రెస్, వైకాపా సభ్యులు గొడవ చేయసాగారు. అంతలో అక్కడ 'ఆపండి' అనే కేక వినిపించింది. అందరూ సైలంట్ అయ్యి వెనక్కి చూసారు. అక్కడ స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64), ఆయన పక్కన సైలంట్ ఆఫ్ సింహపురి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఉన్నారు. వివేకా వారిముందుకొచ్చి... అసలు ఈ సన్మానం ఎవరికి చేయాలనుకుంటున్నారు... మిమ్మల్ని చూసి తెలంగాణ ఎమ్మెల్యేలు భయపడ్డారా? వాళ్లు స్పీకర్ వద్దకు రావడానికి భయపడ్డారా? అంత సీనేమీ లేదు. వాళ్లు మనల్ని ఎక్కడబడితే అక్కడ తన్నగలరు. వాళ్లు సభలో దేనిని చూసి భయపడ్డారో చెప్పను, చూపిస్తాను అని చెప్పి సభలో ఆరోజు జరిగిన దృశ్యాలను పొందుపరచిన సిడిని కిరణ్‌కు ఇచ్చాడు. కిరణ్ దానిని కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేసాడు.

ఆరోజు సభ మొదలైంది. స్పీకర్ నాదెండ్ల మనోహర్ బిల్లును సభ తిరస్కరిస్తున్న తీర్మానాన్ని చదువుతున్నాడు. స్పీకర్‌కు ముందు సీమాంధ్ర ఎమ్మెల్యేలంతా దడిగా కట్టి నిలుచున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ఈటెల రాజేందర్, నాగం జనార్ధన్‌రెడ్డి, కిషన్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, కోమటిరెడ్డి వెంకటరెడ్డి... ఇలా అందరూ ఊపుగా స్పీకర్ వైపుకు బయలు దేరారు. వాళ్ల ఊపు చూస్తుంటే అడ్డుగా వున్న సీమాంధ్ర ఎమ్మెల్యేలను చావబాది స్పీకర్ చేతిలో వున్న తీర్మానం కాపీని చించేటట్లే వున్నారు. వాళ్లు దగ్గరగా వచ్చేసరికి ఆనం వివేకా, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు అడ్డుగా నిలిచారు. వారిద్దరి చేతుల్లో రెండు ప్లాస్టిక్ సంచులున్నాయి. వాళ్లిద్దరూ... మీరు అడుగు ముందుకేస్తే మేం వీటిని వదిలేస్తాం అని బెదిరించ సాగారు. దాంతో తెలంగాణ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గారు. కుక్కిన పేనుల్లా పోయి తమ తమ స్థానాలలో కూర్చున్నారు. ఆ తర్వాత స్పీకర్ నాదెండ్ల మనోహర్ మూజువాణి ఓటుతో టి-బిల్లును తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

ఇక్కడితో కంప్యూటర్‌లో సీన్‌లు ఆగిపోయాయి. అప్పుడు వివేకా వుండి... చూసారుగా, తెలంగాణ ఎమ్మెల్యేలు ఎవరివల్ల ఆగిపోయారో. ఆ క్షణంలో మేమే రాకపోయి వుంటే, మా చేతుల్లో ఆ ప్లాస్టిక్ బ్యాగులు లేకపోయి వుంటే తెలంగాణ ఎమ్మెల్యేలు మిమ్మల్ని పచ్చడి కింద కొట్టేవాళ్లు. ఇప్పటికైనా అర్థమైందా సన్మానం ఎవరికి చేయాలో అని చెప్పాడు. అప్పుడు కిరణ్... వివేకన్నా... ఇంత మందికి భయపడని టి-ఎమ్మెల్యేలు మిమ్మల్ని చూసి ఎందుకు భయపడ్డారని సందేహం వెలిబుచ్చాడు.

దానికి వివేకా... వాళ్లు భయపడింది మాకు కాదు, మా చేతిలో వున్న సంచులకన్నాడు. వాటిలో ఏమున్నాయని కిరణ్ మళ్ళీ ప్రశ్నించాడు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు అని ఫినిషింగ్ పంచ్ ఇచ్చి వివేకా అక్కడనుండి బయలుదేరాడు.

## కదంబం

### "యిల్లే కాదు..."

డా॥కొండెపోగు బి.డేవిడ్‌లివింగ్‌స్టన్, మార్కాపురం, 94402 11120.

యిల్లే కాదు
మనిషన్న వాడు వొళ్ళూ సర్దుకోవాలి
చెత్తనంతా చిమ్మి
తడిగుడ్డతో తుడిచినట్టు
బెంగల్ని -భయాన్ని ఊడ్చి
ఏకబిగిన శుభ్రం చేసి పారేయాలి
చిందర వందరైన గదిని
శ్రద్ధగా తీర్చి దిద్దినట్టు
అదుపు తప్పే ఆలోచనల్ని
దారి తప్పే చూపుల్ని
ఏకోన్ముఖం చేసుకోవాలి
యిల్లే కాదు నేస్తుడా!
వొళ్ళూ సర్దుకోవాలి!
మూల మూలలో వేలాడే బూజు దులపాలి
పేరుకున్న మురికినంతా ఎత్తాలి
ముందు తెలిసెనా?
ఈ మందిర మిటులుంచేనా అంటూ
ఆపసోపాలు పోకుండా
తలపుల తలదిళ్ళు మార్చి
తనువునో ధనువులా నిలబెడుతూ
యిల్లే కాదు చక్కనీ
వొళ్ళూ సర్దుకోవాలి!
పోగుపడ్డ ఎండుటాకుల్ని
అనుకోని కాగితాల అతిథుల్ని
అలవోగ్గా నెట్టేసి
ముంగిట్లో రంగవల్లులు దిద్దినట్టు
అవాంఛిత విచారాల్ని
అనవసరపు కలవరాన్ని తరిమి
ముఖంపై దరహాసాన్ని అద్దుకోవాలి
యిల్లే కాదు భయ్యా!
వొళ్ళూ సర్దుకోవాలి
అల్లరి పిల్లలు వదిలిన భీభత్సపు గదిని
చెల్లా చెదరైన అలమరను
తీరైన యిల్లాలు పునర్నిర్మించినట్టు
సెలవేసే గాయాలకు
బరువెక్కే కాయాలకు
మేలైన చికిత్స చేస్తూ
శ్రమతోనో, స్వేదంతోనో
యిల్లే కాదు మహాప్రభో
అర్జెంటుగా ఇక
వొళ్ళు సర్దుకోవాలి
చెదిరే కళ్ళూ సర్దుకోవాలి.

## "ఫ్రీవర్స్ ఫ్రంట్" అవార్డు పొందిన "ఈతకోట"



వచన కవిత్వానికి రాష్ట్ర స్థాయిలో గౌరవ స్థానానికి సూచికగా నిలిచే "ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు 2013 సంవత్సరానికి నెల్లూరీయులైన ప్రముఖ కవి ఈతకోట సుబ్బారావు రచించిన చీలిన మనిషి" కవుతా సంపుటికి లభించడం నెల్లూరు సాహితీసీమ గర్వించదగ్గ విషయం. ఈ నెల 1న హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో రూ.10,000/-వ నగదు, జ్ఞాపికతో ప్రముఖ కవులు నగ్నముని, శీలా వీర్రాజు, నాళేశ్వరం శంకరం తదితరులు ఈతకోట సుబ్బారావును సత్కరించారు. చీలిన మనిషి కవితా సంపుటిని ప్రసిద్ధ కవి యాకూబ్ సభకు పరిచయం చేసారు. సుప్రసిద్ధ కవులు కె.శివారెడ్డి, డా॥ఎన్.గోపి, నిఖిలేశ్వర్, శీలాసుభద్రాదేవి, కుందుర్తి శాంతి పాల్గొన్నారు.

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

## శివారెడ్డికి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం

కవిత్వ పరిమళాలను నలుచెరగులా వెదజల్లిన సాహితీపుత్రులను సమున్నతంగా గౌరవించడమే ధ్యేయంగా పెట్టుకొని 4 సంవత్సరాలుగా నెల్లూరులోని ఈదూరు సుబ్బయ్య సాహితీపీఠం సాహితీపురస్కారాలనందిస్తోంది. 2011లో ప్రముఖకవి కందుకూరు శ్రీరాములు, 2012లో సాహితీ సరస్వతి జానుమద్ది హనుమచ్ఛాస్త్రి, 2013లో ప్రసిద్ధకవి ఆవంత్స సోమసుందర్ లను రూ.10,000/-ల నగదు, జ్ఞాపిక, మహాభారతం 18 పర్వాల గ్రంథాలతో సముచిత రీతిలో సత్కరించిన పీఠం అధ్యక్ష, కార్యదర్శులు ఈదూరు శేషయ్య, డా॥ఈదూరు సుధాకర్‌లు ఈ ఏడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత కవి కె.శివారెడ్డికి ఈనెల 16న నెల్లూరు ఐఎంఏహాలులో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, వియ్యూ వైస్‌ఛైన్సలర్ రాజారామిరెడ్డిల చేతుల మీదుగా ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. ఈ సాహిత్యసభలో పాల్గొనమని రసజ్ఞులందరినీ వారు ఆహ్వానిస్తున్నారు.

## "చైతన్యఝురి"ని వరించిన "ఎక్స్‌రే" ప్రధాన అవార్డు



కె.వి.నాగేశ్వరరావు

2013 ఎక్స్‌రే ప్రధానఅవార్డు నెల్లూరు జిల్లా కోవూరు వాస్తవ్యులు కె.వి.నాగేశ్వరావు రచించిన కవిత "చైతన్యఝురి"ని వరించడం విశేషం. ప్రతి ఏటా ఎక్స్‌రే సాహిత్య మాసపత్రిక నిర్వహించే జాతీయస్థాయి కవితల పోటీలో ప్రధాన అవార్డు పొందడం ప్రతిష్టాత్మకంగా సాహితీవేత్తలు భావిస్తారు. అటువంటి అవార్డును సాహితీ మిత్రులు కె.వి.నాగేశ్వరరావు పొందడం మనందరికీ గర్వకారణం. ఈయన గతంలో 2008 ఎక్స్‌రే ఉత్తమ కవిత అవార్డును అందుకున్నారు. కాని 2013లో ఎక్స్‌రే ప్రధాన అవార్డు పొందడం ఆయన కవిత్వ రచనలో పరిణతిని సూచిస్తోంది. ఆయన వృత్తి రీత్యా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగి, ప్రవృత్తి రీత్యా కవి, రచయిత. ఇదివరకు ఆయన కవిత్వానికి రాష్ట్రంలోని ప్రముఖ సాహితీ సంస్థల నుంచి 8 జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. ఫిబ్రవరి 23న విజయవాడలో జరిగే "ఎక్స్‌రే" అభినందనసభలో కె.వి.నాగేశ్వరరావును రూ.10,000/-ల నగదు, జ్ఞాపిక, యోగ్యతాపత్రంతో సత్కరిస్తారు. అంతేకాక ఎక్స్‌రే ప్రదానం చేసే పది ఉత్తమ కవిత అవార్డులలో ఇద్దరు నెల్లూరు కవులు ఈతకోట సుబ్బారావు, గుర్రాల రమణయ్యల కవితలు చోటుచేసుకోవడం నెల్లూరు గర్వించదగ్గ విషయం. ఈతకోట సుబ్బారావు, గుర్రాల రమణయ్యలు ఈ ఎక్స్‌రే ఉత్తమ కవిత అవార్డులను ఈ నెల 23న విజయవాడలో జరిగే సాహిత్యసభలో అందుకోనున్నారు. ఎక్స్‌రే అవార్డులు స్వీకరించనున్న ఈ ముగ్గురు నెల్లూరు కవులకు "లాయర్" శుభాభినందనలు.

## మహాత్మాగాంధీపై రచనలకు ఆహ్వానం

జాతిపిత మహాత్మాగాంధీ గురించి రచించిన పద్యాలు, వచన కవితలు, కథలు, నాటికలు, నాటకాలను ఒక సంపుటిగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని ప్రముఖ రచయిత్రి డా॥సి.భవానిదేవి తెలిపారు. రచయితలు స్వీయ రచనలుగాని, తమ దృష్టికొచ్చిన ఇతర రచనలు కానీ జెరాక్స్ కాపీలను తమకు పంపమని కోరుతున్నారు. నాటికలు, నాటకాలు అయితే రచన పేరు, రచయిత ప్రచురణ కర్తల వివరాలు, సారాంశం తెలుపమని కోరుతున్నారు. చిరునామా డా॥సి.భవానీదేవి, 102, గగన్‌మహల్ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం.6, దోమలగూడ, హైదరాబాద్-5000029.

# భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 1న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశమహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు శివయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకబృందం వేకువజామున కలశ ప్రతిష్ట చేసారు. గంగాదేవిని పూజించి ప్రతిబింబ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, స్వస్తి వాచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన, వాసవీహోమం, లలిత సహస్రనామ హోమాలను నిర్వహించారు. కన్యపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దీక్షబూనిన 32 మంది భక్తులు, మేళతాళాలు, బాణసంచాలతో ఊరేగింపుగా బయలుదేరి దేవస్థానం చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసారు.

ఆలయ ఛైర్మన్ మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అర్బన్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, పాలక మండలి సభ్యులు మంచికంటి శ్రీనివాసులు, వాయుగుండ్ల సాయిసువర్ణ, భక్తులు పాల్గొన్నారు.

# సర్దార్ విగ్రహానికి ఇనుమునిద్దాం

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహ నిర్మాణంలో అందరూ క్రియాశీలకంగా పాల్గొని జాతీయ స్రవంతిలో భాగస్వాములు కావాలని కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ కాకు విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ నెల 1న నెల్లూరు వేదాయపాళెం యంవియస్ కల్యాణ మండపంలో జిల్లా వ్యాప్తంగా కమిటీ కో ఆర్డినేటర్లు, కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గుజరాత్‌లో నిర్మిస్తున్న పటేల్ విగ్రహానికి ప్రతిపల్లె నుంచి మట్టి, ఇనుమును సేకరించి జాతీయ సమైక్యతను తెలియజేయాలన్నారు. సేకరించిన ఇనుము, మట్టిని బాక్సుల్లో భద్రపరిచి ఈ నెల 10వ తేదీలోగా జిల్లా కేంద్రానికి పంపాలని జిల్లా కన్వీనర్ మలిరెడ్డి కోటిరెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఆచార్య ఆదిత్య, మిడతల రమేష్, రమణయ్య, సోంపల్లి ఆనంద్, మహబూబ్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

# కాఫీ హోటళ్ళులా మద్యం దుకాణాలు

నెల్లూరు కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో గతనెల 30న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు దేశభక్తి పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఐటిఐ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వొమ్మిన నాగసతీష్, పద్యకవి పంచాగ్నుల విశ్వేశ్వరశర్మలు బహుమతులందించారు. ఈ సందర్భంగా నాగసతీష్ మాట్లాడుతూ నేటి కలుషిత రాజకీయాలు, అవినీతి, కాఫీ హోటళ్ళులా వెలసిన మద్యం దుకాణాలు, యువతను పెడద్రోవ పట్టించే సినీ శృంగార దృశ్యాలు సమాజంలో నైతిక విలువలను నశింపజేస్తున్నాయని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఆదర్శవంతమైన జీవితం, ఆశయాల గురించి యువతకు అవగాహన కలిగేలా చేయాలన్నారు. కార్యక్రమంలో "పినాకిని" అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, ఉపాధ్యక్షుడు రవిగోగులపల్లి, సభ్యులు కె.విజయ్ కుమార్‌రాజు, నాగులాపురం సుమన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

పనులు అనుకున్న విధంగా సాగక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారులు, ఉద్యోగులపై అధికారుల దాడులుండవచ్చును. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. వ్యాపార, పరిశ్రమ యాజమాన్యాలకు అవకాశాలు సరిగా ఉండవు. అవసరములకు ఎవరో ఒకరు ఆదుకుంటారు. నూతన, వ్యాపార, పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ వర్గాలకు అధికారుల సహకారం, యూనియన్ సమావేశాలలో పాల్గొనడం ఉంటుంది. వృత్తి పరంగా వ్యాపకము, ఆదాయం పెరగడం ఉంటుంది. వ్యాపార వర్గములకు ఆర్థికాభివృద్ధి, మంచి వాణిజ్య అవకాశాలు, ఆదాయం పెరుగుదల ఉంటుంది. ఇంటబయట గౌరవ ప్రతిష్ఠ గుర్తింపు బాగుంటుంది. కోర్టు కేసులందు అనుకూలత.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. శుభకార్యాలలో పాల్గొనడం వల్ల ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వ్యవహారాల అనుకూలతకు బాగా కష్టపడవలసి వస్తుంది. వ్యాపార భాగస్వామ్యాలు, కొత్త పెట్టుబడులు, ఒప్పందాలు అనుకూలించగలవు. ఉద్యోగులకు కార్యసమర్థత, అధికారుల ఆదరణ బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

క్రొత్త ప్రణాళికలు, ప్రకటనలతో వ్యాపార వర్గాలు ముందుకు సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. వృత్తి పరంగా తీరిక ఉండదు. అనుకున్న పనులు పట్టుదలతో నెరవేర్చుకొంటారు. అదనపు ఖర్చులు తప్పనిసరిగా పైన బడతాయి. ఆశించిన ఋణాలు, అధికారుల నుండి అనుమతులు దొరుకుతాయి.క్రొత్త వ్యాపారాలు ప్రారంభించడం, భాగస్వామ్య అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు అధికారుల వత్తిడి ఉంటుంది.



బ్రహ్మశ్రీ
**స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 07.02.2014 నుండి తేది. 13.02.2014 వరకు**

ఈ వారం మేష వృషభ మిథున కర్కాటక రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిథునంలో గురువు, తులలో శని, రాహు, కుజులు, ధనుస్సులో శుక్రుడు, కుంభంలో బుధుడు, మకరంలో రవి మరియు 13 తేది నుండి కుంభంలో రవి సంచరిస్తారు.

### పంచాంగము

తేది 10 సోమవారం భీష్మ ఏకాదశి.

### ముహూర్తములు

తేది 09 ఆదివారం ఉదయం 06.30 నుండి గంట 08.30 లోగా కుంభలగ్నమున వివాహ ఉపనయన వ్యాపారాలు.
తేది 10 సోమవారం ఉదయం గంట 06.30 నుండి గంట 07.30లోగా గృహారంభము కుంభలగ్నము.

### మాఘమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | శుక్ర | అష్టమి | సా॥గం.05.30వ॥ |
| తేది. 08 | శని | నవమి | సా॥గం.06.06వ॥ |
| తేది. 09 | ఆది | దశమి | రా॥గం.07.13వ॥ |
| తేది. 10 | సోమ | ఏకాదశి | రా॥గం.08.44వ॥ |
| తేది. 11 | మంగళ | ద్వాదశి | రా॥గం.10.40వ॥ |
| తేది. 12 | బుధ | త్రయోదశి | రా॥గం.12.45వ॥ |
| తేది. 13 | గురు | చతుర్దశి | రా॥గం.02.58వ॥ |

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

స్టాక్‌మార్కెట్ నిరుత్సాహ పరుస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పబ్లిక్‌లో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. అనుకున్న పనులు కొంత ఆందోళన కలిగించినా విజయవంతంగా పూర్తి చేస్తారు. ఖర్చులు పెరిగినా ఆదాయానికి తగినట్లుగా మలుచుకొంటారు. రావలసిన బాకీలు కొంత మేరకు అందడం, కోర్టు కేసులు వాయిదా వేయడం జరుగుతుంది. ఆదాయం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ సభ్యులతో సమస్యలు అభిప్రాయ భేదాలుంటాయి. ఋణాలు మంజూరు కాగలవు. ప్రభుత్వ అనుమతులు దొరుకుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు, రావలసిన బాకీలు వాయిదా పడగలవు. క్రొత్త పరిచయాలు, గృహ వాహన రిపేర్లు సోదర వర్గానికి మేలు మరియు శుభవార్తలు అందుకొనడం జరుగుతుంది. యూనియన్ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తుల క్రయవిక్రయాలు విలువైన వస్తువులు కొనడం వాయిదా వేసికొంటే మంచిది. వ్యాపారాలలో కొద్దిగా ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతూ ఆదాయం కూడా సామాన్యంగా ఉంటుంది. అవసరాలకు అదనపు ఖర్చులు ఋణం చేయవలసి రావచ్చు. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. స్థిరాస్తులపై రాబడి ఆదాయాన్నిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

స్థిరాస్తులు, షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి. తలపెట్టిన పనులు మెలికబడుతూ విసుగు కలిగిస్తాయి. ఆర్థిక ఒడుదుడుకుల మధ్య వ్యాపార రంగం పురోగతిలో సాగుతుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా అదనపు ఖర్చులను నిలువరించలేదు. అవసరాలకు డబ్బు సర్దుబాటవుతూ పనులు జరిగిపోతాయి. కోర్టు వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఇంటి ఖర్చులు, శుభకార్యాల ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వ పరంగా అనుమతులు, క్రొత్త కాంట్రాక్టులు అతిక్రమతో లభించగలవు. వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా ఉండక నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. గతంలో జరిగిన విషయాలపై బంధువులతో మరలా విభేదాలుండవచ్చును. త్వరలోనే ఇబ్బందులను అధిగమిస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు పొందుతారు. క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు అందుతాయి. పలుకుబడి గౌరవాలకు లోపం లేదు. వృత్తి వ్యాపార సంబంధములు విస్తరించగలవు. ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు రాబట్టుకోనే ప్రయత్నాలు చేసారు. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఎదుటివారిని గమనించుకొనిపోతూ మీ పనులను చక్కబెట్టుకొంటారు. ప్రభుత్వ అనుమతులు, క్రొత్త కాంట్రాక్టులు, వ్యాపార భాగస్వామ్య అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక నిర్ణయాలలో, స్థిరాస్తుల లావాదేవీలలో తొందరపాటుగా వ్యవహరించ వద్దు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, స్వల్ప ఆదాయ వృద్ధి ఉంటుంది. అధికారుల తనిఖీల వల్ల ఉద్యోగులకు వ్యాపారులకు ఇబ్బందులు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

చేపట్టిన పనులు, సంప్రదింపులు ఫలిస్తాయి. ఉద్యోగులకు అధికారులతో సఖ్యత, పలుకుబడి బాగుంటుంది. వ్యాపారాలు, లాభసాటిగా ఉండి, వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త పరచుకొనండి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. విద్య, ఉద్యోగ విషయాలలోను శ్రద్ధ చూపుతారు.

# వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



నెల్లూరు మూలాపేటలోని శంకరమఠంలో సోమవారం శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకమహోత్సవాలు వైభవంగా జరిగాయి. శంకర మఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి ఆధ్వర్యంలో శ్రీ కంచి కామకోటి పీఠం ఆస్థాన వేదపండితులు సేనాపతి నేతృత్వంలో ఈ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ నిర్మాణ సహాయకులు పిడూరు శంకర్‌రెడ్డి, పి.పవన్‌కుమార్, కొట్రా శివకుమార్, విష్ణుబొట్ల చంద్రశేఖర్‌శర్మ, ముత్తురాజు సుగుణాకర్‌రావు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు నాదెళ్ళ సాయిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయంలో తొలుత యాగశాల పూజలు, నాడీ సంధానం, స్వర్ణాహుతి, వశోధార పూర్ణాహుతి, ఘటయాత్ర, యాత్ర ప్రవేశం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీ కామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది.

నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి లింగాకారంపై ఎండుపండ్లతో (డ్రైఫ్రూట్స్) కిరీటాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తయారుచేయించారు. ఈ కార్యక్రమంలో అద్దా రాధాకృష్ణమూర్తి, డాక్టర్ యనమండ్ర నాగదేవి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల ముఠా అరెస్టు

గుప్త నిధులకోసం తవ్వకాలకు ప్రయత్నించిన ముఠాను సోమవారం అరెస్టు చేసినట్లు నెల్లూరుజిల్లా ఉదయగిరి సిఐ కల్యాణ్‌రాజు తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో సీతారామపురం ఎస్సై అహ్మద్‌బాషాతో కలసి అరెస్టు చేసిన వారిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. పలు ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది ముఠాగా ఏర్పడి సీతారామపురం సమీపంలోగల పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31న గుప్తనిధుల తవ్వకాలు కోసం వచ్చారని గ్రామస్తులు గమనించడంతో తవ్వకాలు కోసం తెచ్చిన ఆయుధాలు అక్కడే పడేసి పారిపోయారన్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముఠా కోసం పోలీసులు గాలించారని తెలిపారు. తవ్వకాలకు వచ్చిన ముఠాలో దక్కిలి మండలం వెంపటవారిపల్లికి చెందిన కేతినేని మల్లిఖార్జున, ఒంగోలు రాంనగర్‌కు చెందిన పెనుబాకుల రాజగోపాల్‌రెడ్డి, కర్నూలుజిల్లా పాములపాడుకు చెందిన తెలుగు సురేష్, గిద్దలూరు మండలం కొమ్మునూరుకు చెందిన సాల్మన్, ఆత్మకూరు మండలం నాగులపాడుకు చెందిన పేర్నాటి వినోద్‌కుమార్‌రెడ్డి, నెల్లూరులోని మిలిటరీ కాలనీకి చెందిన తోడేటి శ్రీనివాసులు ఉన్నట్లు తెలుసుకుని సోమవారం అరెస్టు చేసినట్లు సిఐ కల్యాణ్‌రాజు తెలిపారు. మరో ముగ్గురు సీతారామపురం మండలానికి చెందిన మౌలాలి, రాము గురవయ్యలు ఉన్నారని వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ముఠాలో ముగ్గురు ఐటిఐ చదివే సాల్మన్ వినోద్‌కుమార్‌రెడ్డి, సురేష్ అనే విద్యార్థులున్నారని సిఐ తెలిపారు.

# ఆఖరిపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ 5వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన చేసిన దీక్ష కాంగ్రెస్ పార్టీకే మింగుడుపడకుండా అయ్యింది. కిరణ్ పోరాటం వల్లే విపక్షాలు సైతం కాంగ్రెస్‌ను నిందిస్తూ, నిలదీస్తూ మీ పార్టీ ముఖ్యమంత్రే వ్యతిరేకిస్తున్న బిల్లును పార్లమెంటులో ఎలా ప్రవేశపెడతారంటూ ప్రశ్నిస్తున్నాయి.

ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలన్నీ ఢిల్లీలో షికారు చేస్తున్నాయి. రాష్ట్రపతి భవన్, ఏ.పి.భవన్, ఏఐసిసి కార్యాలయం, ప్రధాని నివాసం, టెన్‌జనపథ్, బీజేపీ కార్యాలయం... ఎక్కడ చూసినా ఏ.పి. రాజకీయ సందడే కనిపిస్తుంది. ఏ.పి. నాయకులే కనిపిస్తున్నారు. ఒక్కో పార్టీ అధినేతలను విభజన బిల్లుకు మద్దతు ఇవ్వొద్దని సమైక్య నేతలు వెళ్లి కోరివచ్చిన వెంటనే, బిల్లుకు మద్దతు తెలపాలంటూ తెలంగాణ నేతలు కలుస్తున్నారు. దీంతో ఢిల్లీలో విభజన బిల్లుపై ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లుగా మారింది పరిస్థితి. రాష్ట్ర శాసన సభ తిరస్కరించిన బిల్లును పార్లమెంటుకు పంపొద్దని కిరణ్ నేతృత్వంలోని సీమాంధ్ర నేతల బృందం రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి విజ్ఞప్తి చేసింది. విభజనతో వచ్చే నష్టాలను గురించి కిరణ్ ఏకరువు పెట్టారు. మరోపక్క వైకాపా అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షురాలు విజయమ్మలు కూడా రాష్ట్రపతిని కలిసి బిల్లును పార్లమెంట్‌కు పంపొద్దని అడిగారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు బీజేపీ, ఎన్‌సిపి, శివసేన, దళ్‌యు, దళ్(ఎస్), సీపీఐ వంటి పార్టీల నాయకులను కలిసి అడ్డదిడ్డంగా వున్న ఈ విభజన బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

మరోపక్క తెలంగాణ నాయకులు కూడా ఢిల్లీకి చేరి పార్లమెంటులో బిల్లును నెగ్గించుకునేందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసారు. కేంద్రం మాత్రం ఆరునూరైనా ఈ సమావేశంలోనే తెలంగాణ బిల్లును ఆమోదింపజేస్తామంటుంది. అయితే తెలంగాణ బిల్లును సజావుగా గట్టెకించే మార్గాన్ని మాత్రం కేంద్రం అనుసరించడం లేదు. ఢిల్లీలో కిరణ్ దీక్షతో కేంద్రం కొంత డైలమాలో పడింది. సొంత పార్టీలోనే వ్యతిరేకత వస్తుండడంతో ప్రతిపక్షాలతో కూడా మాటలు పడాల్సివచ్చే సరికి కేంద్ర వైఖరిలో కొంత మార్పు వచ్చింది. ఒకటికి మూడుసార్లు జిఓఎం సమావేశం నిర్వహించారు. సీమాంధ్ర నేతల డిమాండ్లను పరిశీలిస్తామనే హామీ ఇచ్చారు. తమ డిమాండ్లు నెరవేరకుంటే పార్లమెంటులో బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు హెచ్చరించడంతో కాంగ్రెస్‌కు వణుకు పుడుతుంది. సీమాంధ్ర నేతల డిమాండ్లు తీర్చడం వారివల్ల అయ్యే పని కాదు. డిమాండ్లు నెరవేర్చకపోతే సీమాంధ్ర ఎంపీలంతా బిల్లుకు అడ్డం తిరుగుతారు. అప్పుడు కాంగ్రెస్‌కు మొదటికే మోసం వస్తుంది. ఈ సమయంలో సీమాంధ్ర ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటేసారంటే వారిని ప్రజలు ఇక ఇక్కడ అడుగు కూడా పెట్టనీయరు.

మరోపక్క పార్లమెంటు ఉభయసభలు సమైక్యాంధ్ర, తెలంగాణ నినాదాలతో దద్దరిల్లుతున్నాయి. ఏ ఒక్కరోజు సభ సవ్యంగా నడిచే పరిస్థితి లేదు. సభ సజావుగా నడిచే పరిస్థితి లేదు కాబట్టి ముందు ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టాలన్న విపక్షాల సలహాను కేంద్రం పెడచెవిన పెట్టింది. ముందు తెలంగాణ బిల్లు, ఆ తర్వాతే ఏ బిల్లయినా అన్నట్లుగా కేంద్రం ధోరణి వుంది. టి-బిల్లు, మతబిల్లుతో సహా 36 బిల్లులను ఈ సమావేశాలలో ఆమోదింపజేయాలని కేంద్రం పట్టుదలగా ఉండగా, బడ్జెట్ ఒక్కటే చాలు, మిగతా బిల్లులను పక్కన పెట్టండని విపక్షాలు కోరుతున్నాయి. తెలంగాణ బిల్లు తెస్తే సభలలో గందరగోళమే. ఒక్కగంట కూడా సభ నడవదు. సభలో సభ్యులపై వేటును బీజేపీ నిరసిస్తుంది. నిరసన తెలుపుతున్న సభ్యులను బయటకు పంపితేగాని కేంద్రం టి-బిల్లును నెగ్గించుకోలేదు.

రాష్ట్ర శాసనసభ తిరస్కరించిన బిల్లును రాష్ట్రపతి పార్లమెంటుకు పంపిస్తారా? అన్నది ప్రశ్న. ఇంతవరకు ఇలాంటిది జరగలేదు. ఆ సంప్రదాయాన్ని ప్రణబ్ ముఖర్జీ విస్మరిస్తారా? లేక రాజ్యాంగ విలువలను కాపాడుతారా? అనేది చూడాలి. మరోపక్క సీమాంధ్ర ప్రయోజనాలను కాపాడే బిల్లుకే తమ మద్దతు ఉంటుందని బీజేపీ ప్రకటించింది. పార్లమెంటు వేదికగా ఆ పార్టీ బిల్లుకు సవరణలు ప్రతిపాదించనుంది. అయితే ఈ సవరణలను ఆమోదించే స్థితిలో కేంద్రం లేదు. వాళ్ళ అర్జంట్‌గా టి-బిల్లును ఆమోదించాలి, సీమాంధ్రులు వాళ్ల చావు వాళ్ళు చస్తారు అన్నట్లుగా వుంది.

మొత్తానికి రాష్ట్ర విభజనపై ఢిల్లీలో తుది సమరం జరుగుతుంది. ఏకపక్షంగా టి-బిల్లును పెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌పై అటు సొంత పార్టీ నేతలతో పాటు ఇటు విపక్ష నేతలు కూడా తీవ్రంగానే పోరాడుతున్నారు. శాసనసభ తిరస్కరించిన టి-బిల్లును రాష్ట్రపతి పార్లమెంటుకు పంపినా, సీమాంధ్రకు న్యాయం చేయకుండా అదే బిల్లును పార్లమెంట్ ఆమోదించినా దేశచరిత్రలోనే ఇంతకంటే పాపం, ఇంతకంటే నేరం, ఇంతకంటే దుర్మార్గం ఇంకొకటి వుండదు.

# తెలుగు రారాజు

అమెరికా బిల్‌గేట్స్ నెలకొల్పిన మైక్రోసాఫ్ట్ 39 ఏళ్ల చరిత్రలో మన తెలుగుతేజం సత్య నాదెళ్ల(47) మూడవ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ)గా నియమితులయ్యారు. స్టీవ్ బామర్ స్థానంలో సత్య నాదెళ్ల బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా, యల్లనూరు మండలం, బుక్కాపురానికి చెందిన నాదెళ్ల సత్యనారాయణ చౌదరి హైదరాబాద్‌లో 1967లో జన్మించారు. తండ్రి యుగంధర్‌నాయుడు మాజీ ఐఏఎస్ అధికారి. సత్య నాదెళ్ల హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం మొదలు, అనంతరం మణిపాల్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, అమెరికా మిల్‌వాకీలోని విస్కాన్సిన్ వర్సిటీ నుంచి ఎం.ఎస్ షికాగో యూనివర్సిటీ నుంచి ఎంబీఏ డిగ్రీ అందుకున్నారు. ఉద్యోగ ప్రస్థానంలో తొలుత సన్ మైక్రోసిస్టమ్స్‌లో చేరి తర్వాత 1992 నుంచి మైక్రోసాఫ్ట్‌లో క్లౌడ్ కంప్యూటింగ్ హెడ్‌గా ఉన్నారు. వేతనం 76 లక్షల డాలర్లు. మైక్రోసాఫ్ట్ సిఇఓగా తనతో పోటీపడిన గూగుల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుందర్ పిచ్చయ్యను తోసిరాజని సత్య దీన్ని దక్కించుకున్నారు. కంపెనీ వ్యవస్థాపకుడు మాజీ ఛైర్మన్ బిల్‌గేట్స్ ఇకపై టెక్నాలజీ అడ్వైజర్‌గా వ్యవహరిస్తారు. విండోస్, ఆఫీస్ వ్యాపార విభాగాలు క్షీణిస్తుండటం, డివైజ్‌లు, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త రంగాల్లోకి మైక్రోసాఫ్ట్ విస్తరిస్తున్న తరుణంలో సత్య సిఇఓగా బాధ్యతలు చేపడుతుండటం గమనార్హం. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం 31,400 కోట్లు డాలర్లు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సత్య వ్యాఖ్యానిస్తూ మైక్రోసాఫ్ట్ ముందు అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని అంది పుచ్చుకునేందుకు మరింత వేగంగా స్పందించడంతోపాటు మరింతగా కష్టపడాల్సి ఉంటుందన్నారు. టెక్నాలజీతో ప్రపంచాన్నే మార్చేసిన అరుదైన కంపెనీల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్‌కి సిఈఓ బాధ్యతలు చేపట్టడం తనకెంతో గర్వకారణమంటున్న సత్య క్రికెట్ అభిమాని.

# 90తో ఓడారు.. 90వేలతో గెలిపిద్దాం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని రేబాలవారివీధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సన్నపరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 5న పలు వ్యాపార సంస్థలకు సంబంధించిన వాణిజ్య నేతలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సన్నపరెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగర ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో పోటీ చేసి 90 ఓట్లతో ఓటమి పాలైనా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనిల్‌కుమార్‌యాదవ్ నిత్యం కృషి చేస్తున్నాడని, రానున్న ఎన్నికల్లో అతనిని 90 వేల మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై వున్న అభిమానంతో, జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంపై వున్న నమ్మకంతో నగరంలోని వాణిజ్యవేత్తలు, ప్రముఖులు వైఎస్సార్సీపీకి మద్దతు పలకడం ఆనందంగా వుందన్నారు. కార్యక్రమంలో పార్టీనేత ముక్కాలద్వారకానాథ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి వెలుగొండయ్య, మంచికంటి శ్రీనివాసులు, అందేపల్లి సుబ్బారావు, నరసింహులు, తిరుమలరావు, శ్రీరాంరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివారెడ్డి, ఇనాక్‌లకు "దాట్ల" సాహిత్య పురస్కారాలు

ప్రతి సంవత్సరం ఒక కథకునికి పురస్కారాలు అందించడానికి "దాట్ల" దేవదానం రాజు సాహితీ సంస్థ నిర్ణయించింది. ఈ సంవత్సరానికి(2014) ప్రముఖ కవి కె.శివారెడ్డి, ప్రముఖ కథకులు కొలకలూరి ఇనాక్‌లకు సంస్థ పురస్కారాలు ప్రకటించింది. కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు 60వ జన్మదినోత్సవం మార్చి 23వ తేదీన యానాంలో జరిగే సభలో పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ పురస్కారం కింద ఒక్కొక్కరికీ పదివేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు.

# నేత్ర పర్వంగా శ్రీవారి దివ్య దర్శనం

రథ సప్తమి పర్వదినం సందర్భంగా టీటీడీ, హిందూధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరం దర్గామిట్టలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈ నెల 6న తేదీ ఉదయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని దివ్య దర్శనం భక్తులకు నేత్రానందం గావించింది. ఈ సందర్భంగా రథ సప్తమి ప్రాశస్త్యాన్ని గురించి ఆలూరు శిరోమణిశర్మ ప్రవచించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా పాల్గొన్న భక్తులకు శ్రీస్వామి దివ్య ప్రసాదం లడ్డూ, అక్షింతలు, కంకణాలు పంపిణీ చేసారు. హిందూధర్మ ప్రచార మండలి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండాశేఖర్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

# మిడిల్ డ్రాప్

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం ద్వారా కాంగ్రెస్ అధిష్టానానికే దడపుట్టించిన సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎటువంటి సంచలనాలను ఆవిష్కరించకుండానే పోటీ నుండి తప్పుకున్నారు. 7వ తేదీ రాజ్యసభకు ఎన్నికలు జరుగుతుండగా ఒకరోజు ముందే 6వ తేదీ తాను ఎన్నికల బరి నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి కిరణ్ ఒత్తిడి మేరకే తాను వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పడం విశేషం. రాష్ట్రంలో ఆరు రాజ్యసభ స్థానాలకుగాను కాంగ్రెస్ ముగ్గురిని, తెలుగుదేశం ఇద్దరిని, టీఆర్‌ఎస్ ఒకరిని అభ్యర్థులుగా నిలబెట్టింది. కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు గెలిచే సత్తా వున్నప్పటికి సమైక్యాంధ్ర గొడవల మూలంగా మరో అభ్యర్థిని నిలబెట్టే సాహసం చేయలేకపోయింది. కాగా టీఆర్‌ఎస్ అభ్యర్థి కేశవరావుకు మద్దతిచ్చేలా మాత్రం రహస్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ దశలో ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చైతన్యరాజులు రెబల్ అభ్యర్థులుగా నామినేషన్‌లు వేసారు. సీఎం కిరణ్ ఒత్తిడితో చైతన్యరాజు బరి నుండి తప్పుకోగా, ఆదాల మాత్రం పోటీలో ఉండిపోయాడు. ఆయన నామినేషన్ ఉపసంహరించుకోకపోవడంతో రాజ్యసభ ఆరు సీట్లకు ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆదాల ఆరోజే నామినేషన్ వెనక్కి తీసుకుని ఉంటే మిగతా ఆరుగురు ఏకగ్రీవమయ్యేవాళ్లు. తీరా ఎన్నికల ముందురోజు ఆయన పోటీ తప్పుకున్నా ఎన్నికలు పెట్టక తప్పలేదు.

సమైక్యవాద అభ్యర్థిగా ఆదాల బరిలో దిగారు. కాంగ్రెస్‌లో 20మందికిపైగా ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా వచ్చారు. సమైక్యరాగం వినిపిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్‌కు 23మంది ఎమ్మెల్యేలున్నారు. ఆ పార్టీ గనుక సమైక్యఅభ్యర్థిగా ఆదాలకు మద్దతిచ్చి ఉంటే ఆయన గెలిచేదానికి అవకాశముండేది. కాని వైకాపా ఆయన ఆశలమీద నీళ్లు చల్లింది. రాజ్యసభ ఎన్నికలలో పాల్గొనరాదని ఆ పార్టీ నిర్ణయించుకోవడంతో ఆదాల గెలుపుకు దారులు మూసుకుపోయాయి. దీంతో సమైక్య అభ్యర్థిగా ఓడిపోతే సమైక్య ఉద్యమంపై ప్రభావం పడుతుందనుకున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి సీఎం కిరణ్ సలహామేరకు పోటీ నుండి తప్పుకున్నారు.

### *కె.వి.పికి మూడేదే...*

ఆదాల బరిలో నుంచి వైకాపా మద్దతు తెలిపి వుంటే కె.వి.పి.రామచంద్రరావుకు చుక్కెదురై ఉండేదని పరిశీలకుల అంచనా. కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో టి.సుబ్బరామిరెడ్డికి ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు వుంది. ఇక తెలంగాణ ఎమ్మెల్యేలంతా ఎం.ఎ.ఖాన్‌కు ఓటేస్తారు. కె.వి.పి.కి మిగిలిన ఎమ్మెల్యేల్లో చాలాతక్కువ ఓట్లు పడే అవకాశముంది. వీరిలో ఎక్కువమంది ఆదాలవైపు మొగ్గుచూపే పరిస్థితులు ఏర్పడ్డాయి. వైకాపా ఆదాలకు మద్దతు తెలిపినట్లైతే కె.వి.పి.ని ఓడించడం ద్వారా వై.యస్. స్నేహానికి ద్రోహంచేసిన కె.వి.పికి గుణపాఠం చెప్పినట్టై ఉండేది. ఒకే దెబ్బకు రెండు పిట్టల మాదిరిగా అటు కె.వి.పిని దెబ్బకొట్టి, ఇటు తన అభ్యర్థిగా ఆదాలను గెలిపించుకోగలిగి వుండేవాడు. జగన్ ద్వారా సమైక్యాంధ్ర ఉద్యమం కూడా మరింత ఊపుమీదుండేది. అయితే ఈ సదావకాశాన్ని జగన్ చేజార్చుకోడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైకాపా మద్దతు లభిస్తుందనే ఆశతో నిలబడ్డానని, నేను నామినేషన్ ఉపసంహరించుకుంటానంటే వద్దు, పోటీలో ఉండమన్నది కూడా ఆ పార్టీయేనని, తీరా ఎన్నికలదాకా వచ్చాక ఓటింగ్‌లో పాల్గొనబోమని హ్యాండిచ్చిందని గురువారం విలేకరుల ముందు ఆదాల ప్రకటించారు. వైకాపానే గనుక రాజ్యసభ ఎన్నికలలో ఆదాలకు మద్దతునిచ్చి గెలిపించి ఉంటే సమైక్యాంధ్ర కోసం ఆ పార్టీ చేస్తున్న ఉద్యమానికి ఇంకొంత బలం చేకూరి వుండేది. ఆదాల కూడా ఆ పార్టీ ఎంపీగానే ఉండిపోయేవాడు. కాని ఎందుకో చేతిలో ఉన్న అవకాశాన్ని వైకాపా చేజార్చుకుంది.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆప్కాబ్ అండ్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్-2014 క్యాలెండర్‌ను నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఈ నెల 5న బ్యాంకు అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కెఆర్‌పి కుమార్ అధ్యక్షతన జరిగింది.

# ఢిల్లీతో ఢీ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సరిపెట్టుకోలేదు, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలంటూ 5వ తేదీ ఆయన ఢిల్లీలో మౌనదీక్షకు దిగారు. ఆయన దీక్షతో కేంద్రంలో కదలిక వచ్చింది. సొంత పార్టీ ముఖ్యమంత్రే కేంద్ర ప్రభుత్వానికి ఎదురుతిరిగి ఢిల్లీలో దీక్ష చేసిన సందర్భమే చరిత్రలో లేదు. కిరణ్ వైఖరితో అధిష్టానం ఖంగుతింది. విపక్షాలు కూడా కాంగ్రెస్‌ను ఎత్తిపొడవడానికి కిరణ్ పోరు ఒక సాకుగా మారింది. సొంత పార్టీ సీఎం చేతనే బిల్లుకు ఆమోదం పొందని మీరు ఇక పార్లమెంట్‌లో అన్ని పక్షాల మద్దతు ఎలా పొందుతారని కాంగ్రెస్‌ను నిలదీస్తున్నాయి. కిరణ్‌కు సీఎం పదవి కాంగ్రెస్ ఇచ్చిన వరమే. అయితే కాంగ్రెస్‌కు ఆ అధికారం ఇచ్చింది ప్రజలు. కాబట్టే పార్టీకంటే ప్రజలే ముఖ్యమనుకున్న కిరణ్ సమైక్య సాధన కోసం ప్రజల పక్షాన నిలిచాడు. ఈ పోరాటంలో అధిష్టానానికి ఎదురుతిరిగినందుకు ఆయన పదవి పోవచ్చు, లేదా పార్లమెంటులో బిల్లు పెడితే ఆయనే రాజీనామా చేయొచ్చు. భవిష్యత్‌లో ఆయనకు పెద్దగా రాజకీయ భవిష్యత్ ఉండకపోవచ్చు. కాని సమైక్య ఉద్యమచరిత్రలో మాత్రం ఆయన పేరు శాశ్వతంగా ఉంటుంది.

# మూ'వీ'క్షణం

## 'శృతి'మించిన సీన్‌లు



టాలీవుడ్‌లో సంప్రదాయంగా కనిపించే శృతిహాసన్ బాలీవుడ్ సినిమా 'డిడే'లో హాట్ హాట్‌గా కనిపించింది. అయితే ఆ సినిమాను తమిళంలోకి డబ్బింగ్ చేస్తున్నట్లు తెలిసే సరికి శృతిహాసన్ ఖంగారెత్తిపోయింది. నిర్మాతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన అనుమతి లేకుండా డబ్బింగ్‌చేస్తే లీగల్‌గా పోతానని హెచ్చరించింది.

## టాలీవుడ్‌లో నేనే నెం.1



ఇండియాలో అభిమానుల ఫాలోయింగ్ ఎక్కువుగా వున్న హీరోలెవరని స్టార్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పవన్ కల్యాణ్‌కు 5వ స్థానం దక్కింది. మొదటి మూడూ స్థానాల్లో సల్మాన్‌ఖాన్, షారూఖ్‌ఖాన్, అమీర్‌ఖాన్‌లు నిలువగా నాలుగో స్థానంలో విజయ్, ఐదో స్థానంలో పవన్ నిలిచారు.



## ఏప్రిల్‌లో 'సూపర్'ఫైట్

దక్షిణ, ఉత్తరాది సూపర్‌స్టార్‌లు రజనీ కాంత్, అమితాబ్‌లు నటించిన రెండు సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. రజనీ నటించిన గ్రాఫికల్ మానియా 'కొచ్చాడియన్' ఈ నెల 11న రిలీజ్ కానుండగా అదేరోజు బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ నటించిన 'భూత్‌నాథ్ రిటర్న్స్' సినిమా కూడా అదే రోజు రిలీజ్ కానుంది. రెండు అగ్ర హీరోల సినిమాలు ఒకేరోజు వస్తే ఇక దేశమంతా థియేటర్ల వద్ద పండుగే!

## శేఖర్ సినిమాలో సునీత



సింగర్‌గా సుపరిచితమైన సునీత త్వరలో తెలుగుసినిమాలో కనిపించబోతుంది. ఈ అందాలగాయని ఇప్పటివరకు టివి ప్రోగ్రామ్‌లలో మాత్రమే కనిపించేది. కాని ఈసారి శేఖర్ కమ్ముల తీస్తున్న 'అనామిక' సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా ఫిబ్రవరి 27న విడుదల కానుంది.

## 1 తెచ్చిన లాసెంత?



మహేష్‌బాబు హీరోగా వచ్చిన '1' చిత్రం అంచనాలను తలక్రిందులు చేసింది. ఈ చిత్రం మొదటిషో నుండే నెగటివ్ టాక్ తెచ్చుకుంది. కథా, కథనం సామాన్య ప్రేక్షకులకు అర్థంకాకపోవడంతో ఆదరణ కొరవడింది. శాటిలైట్, ఆడియో రైట్స్, ఓవర్సీస్ బిజినెస్ అన్నీ కలుపుకుంటే 25 నుండి 30కోట్ల వరకు నష్టం ఉండవచ్చని అంచనా!

# వైఎస్ సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ తూట్లు




బహిరంగసభలో మాట్లాడుతున్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, సభలో పాల్గొన్న జనం

దివంగత నేత ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. గూడూరు పట్టణంలోని గడియారస్తంభం వద్ద జనవరి31 రాత్రి నిర్వహించిన సమైక్య శంఖారావం సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విభజనకు తెలుగు దేశంపార్టీ పరోక్షంగా సహకారం అందజేస్తుందని ఆరోపించారు. శాసనసభ 40రోజులుగా కేవలం రాష్ట్ర విభజన కోసమే కొనసాగిందని, కనీసం పేదవాడి బాగోగులు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. సమైక్య వాదులంతా దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోనియా కనుసన్నల్లోనే సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి నడుచుకుంటున్నారని సమైక్య ముసుగులో ప్రజలను మభ్యపెడుతున్నారని వివరించారు. 4నెలల్లో ఎన్నికలు రానున్నాయని 30ఎంపి స్థానాలను వైకాపాయే గెలుచుకుంటుందన్నారు. ఆ తరువాత ఢిల్లీ కోటను బద్దలు కొట్టి రాష్ట్రాన్ని విభజించే దమ్ము, ధైర్యం ఎవరికుందో తేల్చుకుందామన్నారు. ఈ సభలో నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్, ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాలరెడ్డి సమన్వయకర్తలు కాకాణి గోవర్థన్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, కె.సంజీవయ్య, అనిల్ కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తిరుపతి లోక్‌సభ పరిశీలకుడు వరప్రసాద్, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, కుమారస్వామిరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, తదితర నేతలు పాల్గొన్నారు.

జగన్ సభా వేదిక మీదకు వచ్చే సమయానికి టవర్‌క్లాక్ నాలుగు వైపులా రోడ్లు జనంతో కిటకిటలాడాయి.



# గూడూరు డివిజన్ వార్తలు

## కలవకొండ గ్రామస్తులు నిరసన

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆర్డీవో మధుసూదనరావు ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. చిల్లకూరు మండలం కలవకొండ గ్రామానికి చెందిన రైతులు నిరసన వ్యక్తంచేశారు. సర్వేనెంబరు 1036-1, 1036-2, 1034-1బిలో ఉన్న 6.20ఎకరాలను గతంలో మూడు కుటుంబాల వారికి ప్రభుత్వం అసైన్‌మెంట్ కింద పట్టాలు మంజూరుచేసిందని చెప్పారు. ఆ భూములలో తాము సాగు చేపడు తున్నామని వివరించారు. కర్నూలు జిల్లాకు చెందిన వారు రెవెన్యూ దస్త్రాల్లో వారి పేర్లను నమోదు చేం

యించుకొని పట్టాదారు పాసుపుస్తకాలను పొందారని చెప్పారు. ఆ క్రమంగా పొందిన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దుచేసి తమ పేరిట గ్రామ లెక్కల్లో నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. పలు భూసమస్యలపై చిట్టమూరు, వాకాడు, వెంకటగిరికి సంబంధించిన బాధితులు ఆర్డీవోను కలసి తమ వినతులను సమర్పించి న్యాయం [illegible]

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని అర్బన్ సిడిపివో ఉమామహేశ్వరి ఆదివారం తెలిపారు. అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీలు 5, సహాయకుల భర్తీలు 17 ఉన్నాయన్నారు. కార్యకర్తల పోస్టుల్లో బేతానిస్కూల్, జానకిరాం పేట, నలజాలమ్మవీధి, కుమ్మరవీధి, కేంద్రాలు ఓసీ, ఎగువ వీరారెడ్డి పల్లె కేంద్రం ఎస్సీ వారికి రిజర్వు అయిందన్నారు. కార్యకర్తల పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణత, సహాయకుల పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఈ ఏడాది జనవరి 31నాటికి 21ఏళ్లు నిండి 35ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు ఈనెల 10వతేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## సాయిరాం కాంప్లెక్స్ ప్రారంభోత్సవం



కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సిఎంకె రెడ్డి, నిర్మల, పక్కన భానుచందర్, విదర్శ

గూడూరు కోనేటిమిట్టలో నూతనంగా నిర్మించిన సాయిరాం కాంప్లెక్స్ భవనాన్ని చెన్నైకి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.ఎం.కె.రెడ్డి, నిర్మల దంపతులు ఆదివారం ప్రారంభించగా జ్యోతిప్రజ్వలనను తమిళ సినీనటి విదర్శ చేశారు. ద్వారకామయి షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రముఖ సినీనటుడు భానుచందర్, సినీనటి విదర్శ ప్రారంభించారు. సి.ఆర్ మార్టును ఏపి ట్రాన్స్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బొమ్మిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఇందిరమ్మ ప్రారంభించగా డ్రస్ యుపిని ముంబై ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ గీతా నరసింహన్ ప్రారంభించారు.

ద్వారకామయి డైనింగ్ హాలును చెన్నైకి చెందిన ప్రముఖ వైద్యులు సి.మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం సీతా రాముల కల్యాణం, సాయి సత్యవ్రతం, సాయిబాబా భజన ద్వారకామయి ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, సాయిదీప్తిరెడ్డిలతో పాటు పట్టణంలోని పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు భానుచందర్ మాట్లాడుతూ సినీరంగంలో ప్రతిభతో పాటు, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. తాను 1977లో సినీరంగంలోకి ప్రవేశించి ఇప్పటి వరకు దాదాపు 150చిత్రాల్లో నటించానన్నారు. అందులో తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం చిత్రాలున్నాయన్నారు. తనకు ఇద్దరు కుమారులు కాగా ఒకరు మెడిసన్ చదువుతున్నాడని, మరొకరు చిత్రరంగంలో ఉన్నాడని, తన కుమారుడు జయంత్ ప్రస్తుతం రెండు తెలుగు, ఒక తమిళ చిత్రంలో నటిస్తున్నాడని తెలిపారు.

## అభివృద్ధి పనులు ఆరంభం

గూడూరు ధూర్జటినగర్‌లో డ్రైనేజీ పనులు కాంగ్రెస్‌పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. విందూరు గ్రామంలోని రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో 2కోట్లతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు శంఖుస్థాపనచేశారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ పట్టణంలో 5కోట్లతో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ధూర్జటినగర్‌లో 20లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబురెడ్డి, గోపాల్ యాదవ్, ముని గిరీష్, జమళ్ల వాసు, మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, ముత్యాలయ్య, పట్టణ అధ్యక్షుడు మనుబోలు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఆర్అండ్‌బి అతిథిగృహంలో పనబాక కృష్ణయ్య "పేస్ బుక్" ఖాతాను ప్రారంభించారు.

## పట్టణ సిఐగా భూషణం



గూడూరు పట్టణసిఐగా వి.భూషణం ఇటీవల ఎ ద వీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్‌ను గుంటూరు వీఆర్‌కు బదిలీ చేశారు. దీంతో ఒంగోలు గ్రామీణ సిఐగా పని చేస్తున్న భూషణంను గూడూరు పట్టణానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన "లాయర్"తో మాట్లాడుతూ పట్టణంలో నేరాల అదుపు, ట్రాఫిక్ నియంత్రణ, చోరీలను అరికట్టేందుకు ప్రస్తుతం రాత్రిళ్లు గస్తీ పెంచుతామని అన్నారు.

# కళ్యాణ వైభోగం...!



దగదర్తి మండలం పెదపుత్తేడు వాస్తవ్యులు మొలకల వెంకటరమణారెడ్డి - లలితమ్మల మనుమరాలు, మొలకల ఆదినారాయణరెడ్డి - విజితల కుమార్తె **సాయి ఆశ్రిత - పెంచల హర్షరెడ్డి** (కోవూరు వాస్తవ్యులు పచ్చిపాల హరనాథరెడ్డి - శైలజల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 5వ తేదీ కస్తూరిదేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# నాకు సంగీత జీవితాన్ని ప్రసాదించింది గూడూరే

## - శ్రీ కాళిదాస కళానికేతన్ వార్షికోత్సవ సభలో ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం -



స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

భగవంతుని దయవుంటే తనకు ఓపిక ఉన్నంత వరకు పాటలు పాడుతానని ప్రముఖ నేపథ్య గాయకుడు డాక్టర్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 5న గూడూరులోని కాళిదాస కళానికేతన్ 55వ వార్షికోత్స వేడుకలు స్థానిక డి.ఎన్.ఆర్ కమ్యూనిటీహాలులో అత్యంత వైభంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం శ్రీకాళిదాస కళానికేతన్ స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీల్లో బహుమతులు పొందడం ముఖ్యంకాదని, ఆహూతులను అలరించేలా పాడితే బహుమతులు వాటంతట అవే సొంతమవుతాయన్నారు. 1962లో మొట్టమొదట ఇక్కడ నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొని బహుమతి సాధించానని తెలిపారు. 16ఏళ్ళ వయస్సులో తాను వేదికలపై పాడుతున్నప్పుడు ప్రముఖ గాయని జానకి వెన్నుతట్టి ప్రోత్సహించారని, ఆమె ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. 55 వసంతాలుగా కళానికేతన్ అధ్యక్షుడు షేక్‌గౌస్ బాషా, కార్యదర్శి ప్రభాకర్‌రావు నిర్విఘ్నంగా వార్షికోత్సవాలు నిర్వహించడం వారి కళాహృదయానికి తార్కాణమన్నారు. చిన్న పట్టణంలో కూడా సంగీతం, గాత్ర మాధుర్యాలతో గీతాలు ఆలపిస్తున్న స్వరార్చన బృంద సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్ కరెంటు ఆధ్యర్యంలో చేసిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. బాలును పట్టణ ప్రముఖులు సత్కరించారు. 'లాయర్' వార పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అక్కినేని మృతికి 2 నిమిషాలు మౌనం పాటించవలసిందిగా కోరారు. కాళిదాస కళానికేతన్ 75వ వార్షికోత్సవం కూడా జరగాలని దానికి మరలా ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సిఆర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది వై.చలపతిరావు, ఆడిటర్ ఎస్.రాంమోహన్ రావు, హైదరాబాద్ కామినేని హాస్పిటల్ గుండె వ్యాధినిపుణులు చుండూరు కోదండపాణి, రామానుజదాసుడు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, మనపాటి రవీంద్రబాబు, మయూరీ శ్యాంయాదవ్, కె.ఎస్.రెడ్డి, జి.శివకుమార్, పత్రి జనార్ధన్, ఉపేంద్రరావునాయుడు, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సిఆర్‌రెడ్డి శ్రీ కాళిదాస కళానికేతన్ పక్షాన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సత్కరించారు.



ఎస్.పి.బాలును సత్కరిస్తున్న డా॥ సి.ఆర్.రెడ్డి, ప్రభు, గౌస్‌బాషా

## జగనన్నా... మీవెంటే మేమన్నా...

# పోటెత్తిన జనసాగరం



జనం కోసం జగన్... జగన్ కోసం జనం... ఒకరి కోసం ఒకరు పరుగులు తీస్తున్నవైనం... జనవరి 31వ తేదీ నెల్లూరు జిల్లాలో ఈ విషయం ప్రస్ఫుటంగా కనిపించింది. చిత్తూరుజిల్లాలో సమైక్య శంఖారావం యాత్ర ముగించుకుని వైకాపా అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పెళ్లకూరు సమీపంలో జిల్లాలోకి ప్రవేశించారు. జిల్లా సరిహద్దుల వద్ద భారీఎత్తున ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు జగన్‌కు అపూర్వ స్వాగతం పలికారు. జిల్లాలో నాయుడుపేట, మనుబోలు, గూడూరులలో జగన్ సమైక్య శంఖారావసభలు నిర్వహించగా, జనం పోటెత్తినట్లు వచ్చారు. ముఖ్యంగా సర్వేపల్లి ఇన్‌ఛార్జ్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మనుబోలు సభకు జనం ఇసుకేస్తే రాలనంతగా వచ్చారు. పెళ్లకూరు నుండి మనుబోలు వరకు కూడా దారిపొడవునా పల్లెల్లో ప్రజలు జగన్‌ను ఆపి పూలు చల్లి తమ అభిమానం చాటుకున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా జగన్‌ను చూడడం కోసం జనం బారులుతీరారు. మనుబోలులో సభ ముగిసిన తర్వాత ఆయన ప్రయాణిస్తున్న వాహనం జాతీయ రహదారి వద్దకు చేరడానికి గంట సమయం పట్టిందంటే జనం ఎంతగా వచ్చారో అర్ధం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఇక్కడ గమనించాల్సిందేంటంటే వచ్చిన వారంతా కూడా బలవంతంగా తోలిన జనం కాదు. స్వచ్ఛంధంగా జగన్ మీద అభిమానంతో వచ్చిన వాళ్లే! వందనోటు, మందుసీసాకు ఆశపడకుండా వచ్చిన వాళ్లే. వేలాదిమంది జనం ఒకేచోట వున్నా సారాయి గుభాళింపులు లేవు, అభిమాన పలకరింపులే కనిపించాయి. మనుబోలు సభ తర్వాత పాతరోడ్డు మీదుగా గూడూరులోకి చేరుకున్న జగన్‌కు ప్రజలు పూలుచల్లి స్వాగతం పలికారు. దారి పొడవునా ప్రజలను అభిమానంగా పలుకరిస్తూ వృద్ధులను హత్తుకుంటూ, చిన్నారుల తలలు నిమురుతూ ఆయన ముందుకు సాగారు. టవర్‌క్లాక్ సెంటర్‌లోని సభాస్థలికి చేరడానికి ఆయనకు గంటకు పైగానే సమయం పట్టింది.

సమైక్యశంఖారావసభలలో జగన్ సూటిగా, ధాటిగా మాట్లాడారు. రాష్ట్రవిభజన విషయంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు వైఖరిని తూర్పారబట్టారు. చంద్రబాబు వల్లే రాష్ట్ర విభజనకు బీజం పడిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధిష్టానం డైరక్షన్‌తోనే సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నాటకాలాడుతున్నారని విమర్శించారు. సమైక్య రాష్ట్రం కోసం సంపూర్ణంగా కృషి చేస్తున్నది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీయేనని చెప్పారు. జగన్ ప్రసంగం ప్రజలలో ఉత్సాహాన్ని నింపింది. ప్రతిచోట ప్రజలు చప్పట్లతో ఆయన ప్రసంగానికి హర్షధ్వానాలు తెలిపారు.

**రెండోరోజు సభలు రద్దు:** సమైక్యశంఖారావం షెడ్యూల్ ప్రకారం జిల్లాలో రెండురోజులు జరగాల్సి వుండింది. అయితే ఇడుపులపాయలో ప్లీనరీ కారణంగా వెంకటగిరి, ఆత్మకూరు కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు.

### అనూహ్యంగా గూడూరులోనే సిఇసి భేటీ

31వ తేదీ గూడూరులో సభ ముగియగానే జగన్ ఇడుపులపాయకు బయలుదేరాలి. కాని జగన్ అనూహ్యంగా ఆ రాత్రికి అక్కడే బస చేసారు. 1వ తేదీ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, తన కోసం వచ్చిన ప్రజలతో ముచ్చటించారు. పార్టీ సెంట్రల్ గవర్నింగ్ బాడీ సభ్యులతో సమీక్షా సమావేశాన్ని గూడూరులోనే నిర్వహించారు. ఈ కమిటీలో సభ్యులైన సోమయాజులు, వై.వి.సుబ్బారెడ్డి, జివిడి కృష్ణమోహన్‌లు అప్పటికప్పుడు గూడూరు చేరుకున్నారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి ఇంట్లో జరిగిన సమీక్షాసమావేశంలో వీరు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలో జిల్లా వైకాపా నాయకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, పాశం సునీల్‌కుమార్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పి.అనిల్‌కుమార్‌యదావ్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వరప్రసాద్, ఎల్లసిరి రాజీవ్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, డాక్టర్ బాలచెన్నయ్య, బత్తిని విజయకుమార్, వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యానికే సింహపురి హాస్పిటల్




నెల్లూరు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే సింహపురి హాస్పిటల్‌ను నిర్మించామని సింహపురి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6న నేషనల్ హైవే, చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద గల ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం చిరమన గ్రామానికి చెందిన తాను మహారాష్ట్రలో కాంట్రాక్టు పనలు నిర్వహిస్తూ జిల్లా ప్రజలకు మంచి వైద్యాన్ని అందించాలనే ఉద్దే శ్యంతో మరో ముగ్గురితో కలిసి హాస్పిటల్‌ను రేయింబవళ్ళు దగ్గరుండి రూపుదిద్దినట్లు పేర్కొన్నారు. అతి తక్కువ ఫీజులతోపేద ప్రజలకు ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సింహపురి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హరికృష్ణ మాట్లాడుతూ రథసప్తమి పర్వదినం సందర్భంగా ఒపిని మాత్రం ప్రారంభిస్తున్నామని, మార్చి నెల 14వతేదీ నుండి హాస్పిటల్‌లో అన్ని విభాగాలు పనిచేస్తాయన్నారు. అన్ని విభాగాలకు అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉన్నారని ప్రతి పేషంటుకు ఒక నర్సు దగ్గరుండి సేవలందిస్తుందన్నారు. ఈ హాస్పిటల్‌లో పూర్తి ఏసి సదుపాయం ఉందన్నారు. 250 పడకల మల్టీసూపర్ స్పెషాలిటి, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో 8 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోగనిర్ధారణా సదుపాయం, పూర్తి పరికరాలున్న అంబులెన్సులు ఉన్నాయన్నారు. ఇక మీదట రోగులు అత్యవసర పరిస్థితుల్లో ఆధునిక చికిత్స కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు పోవలసిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు బిందుమీనన్, పవన్‌కుమార్‌రెడ్డి, సౌమ్య, మోహన్‌రావు, లక్ష్మిరమేష్, శశిధర్, కిషోర్‌కుమార్, రమేష్‌బాబు, గోపాలకృష్ణ, శ్రీలక్ష్మి, శశిధర్(ఆర్థో), రాజమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.